


సోనామసూరి కిలో రూ.49, కందిపప్పు రూ.160

» నేటి నుంచి రైతుబజార్లు, మాల్స్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 13 రైతుబజార్లు, డీమార్ట్, రిలయన్స్, మోర్, స్పెన్సర్స్ తదితర మాల్స్‌లో బియ్యం, కందిపప్పు కౌంటర్లు గురువారం నుంచి అందుబాటులోకి వస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోనామసూరి (బీపీటీ రకం) స్టీమ్డ్ బియ్యం కిలో రూ.49, 'రా' రైస్ రూ.48, కందిపప్పు కిలో రూ.160కు లభిస్తాయన్నారు. ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఈ కౌంటర్లు ఏర్పాటుచేశామన్నారు.

అస్తవ్యస్త విశాఖ!



వైసీపీ పాలనలో దందాలు, బెదిరింపులు, సెటిల్‌మెంట్లు

» రూ.వేల కోట్ల ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు హస్తగతం
» కుదేలైన ఐటీ, పర్యాటక రంగం
» మెట్రో రైలును మూలనపడేసిన జగన్ సర్కారు
» వైసీపీ కార్యాలయంగా మారిన ఆంధ్ర విశ్వవిద్యాలయం

చంద్రబాబునాయుడుపైనే నగరవాసుల ఆశలు

» పూర్వ వైభవం దిశగా చర్యలు తీసుకోవాలని విన్నపం

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి):

ప్రశాంతత...ఐటీ, పర్యాటక రంగాలతో కళకళ... సందర్శకులతో నిత్యం కిటకిట...ఇదీ ఐదేళ్ల కిందట మహా విశాఖ ప్రాభవం... వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతా అస్తవ్యస్తం...అడుగడుగునా భయం...డ్రగ్స్, గంజాయితో కలకలం..హత్యలు, అత్యాచారాలు, దాడులు పెచ్చుమీరి నగరవాసులు భయం గుప్పిట గడపాల్సిన దైన్యం...ఎట్టకేలకు జగన్ పాలనకు జనం చరమగీతం పాడడంతో ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న వైనం...పాలనాదక్షుడు చంద్రబాబుపై నమ్మకం..పూర్వ వైభవం దిశగా అడుగులు పడతాయనే ధైర్యం....

విశాఖ నగరంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విడదీయని బంధం ఉంది. అభివృద్ధి, ఐటీ పరిశ్రమల ఏర్పాటు, పర్యాటక ప్రాజెక్టులతో నగరానికి బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువచ్చిన ఘనత ఆయనదే. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారి, కల్లోల విశాఖగా మిగిలిపోయింది. ప్రశాంతతకు మారుపేరుగా గుర్తింపు తెచ్చుకున్న మహా నగరంలో బిహార్ తరహా మాఫియా రాజ్యమేలింది. కన్నుపడిన భూములు, ప్రాజెక్టులు, హోటళ్లను వైసీపీ నేతలు గుంజుకున్నారు. బెదిరించి బలవంతంగా లాక్కున్నారు. ఈ జాబితాలో కార్తీకవనం (రాడిసన్ బ్లూ హోటల్), బే పార్కు వంటివి ఎన్నో ... మిగతా 6వ పేజీలో

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక

తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన

» అక్కడ నుంచి భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు...
» అనంతరం మెడ్‌టెక్ జోన్‌లో కార్యక్రమాలకు హాజరు
» ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అధికారులతో సమీక్ష - Iలో



మెడ్‌టెక్‌జోన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

ఉక్కుపై వివక్ష

నిర్వీర్యం చేసేందుకు కుట్ర

» ఉత్పత్తిపై సమీక్షలు పక్కనపెట్టిన మంత్రిత్వ శాఖ
» ఆస్తుల అమ్మకంపైనే దృష్టి
» కర్మాగారానికి రూపాయి విదల్చలేదు
» ఇప్పటికే ముడి పదార్థాల కొరత
» మరోవైపు బైలదిల్లా నుంచి ఐరన్‌ఓర్ ఇవ్వబోమని హెచ్చరికలు
» కర్ణాటక నుంచి తెచ్చుకోవలసిందిగా సూచనలు
» అలాగైతే మరింత పెరగనున్న ఉత్పత్తి వ్యయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును మరింత నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం పావులు కదుపుతోంది. ఒకవైపు ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు అందకుండా చేస్తూ...మరోవైపు నిరర్థక ఆస్తుల పేరుతో విలువైన వాటిని విక్రయించుకుంటూ పోతోంది. నిత్యం ఉక్కు ఉత్పత్తిపై సమీక్షించాల్సిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆ విషయాన్ని పక్కన పెట్టి పొదుపు చర్యలు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఫోకస్ పెట్టింది. నానా తంటాలుపడి అక్కడ ఇక్కడ నిధులు సమకూర్చుకుంటుంటే అవి కాకుండా సద్వినియోగం కాకుండా అడ్డంకులు సృష్టిస్తోంది.

ఇవిగో సాక్ష్యాలు

స్టీల్‌ప్లాంట్లలో సామర్థ్యానికి మించి ఉత్పత్తి తీయాలనేది కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ లక్ష్యం. అలా ఎక్కువ ఉత్పత్తి చేసిన వారికి ఇన్సెంటివ్‌లు ఇవ్వడం ఆనవాయితీ. ఏ ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంటులో అయినా ఒక్క గంట ఉత్పత్తి ఆగిపోతే దానిపై వివరణ ఇచ్చుకోవలసిన పరిస్థితి. ఇవన్నీ గత మూడేళ్ల క్రితం వరకూ పక్కాగానే జరిగాయి. విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించాలని బలంగా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి ఇక్కడి ఉత్పత్తిపై సమీక్షలు ఆగిపోయాయి. కార్మికులు ఎంతమంది ఉన్నారు?, వారిలో ఎంతమందిని తగ్గించవచ్చు?, వారికి అందుతున్న వైద్య సేవలు ఏమిటి?, అందులో కోత ఎలా వేయాలి?, స్టీల్‌ప్లాంటు క్వార్టర్లలో వినియోగిస్తున్న విద్యుత్‌కు ... మిగతా 6వ పేజీలో

విశాఖ చేరుకున్న ఉక్కు మంత్రి కుమారస్వామి

» నేడు స్టీల్‌ప్లాంటు సందర్శన



కేంద్ర మంత్రులు హెచ్.డి.కుమారస్వామి, శ్రీనివాసవర్మలను సన్మానిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ నేత కాశీవిశ్వనాథరాజు

గోపాలపట్నం, జూలై 10: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం విశాఖపట్నం వచ్చారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి ఆర్ఐఎన్ఎల్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి బస చేశారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు స్టీల్‌ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

50,66,616

ఇదీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జనాభా సంఖ్య

» గత ఏడాదిలో 54,658 మంది పెరుగుదల
» విభజిత విశాఖ జిల్లా జనాభా 23,85,658
» అనకాపల్లి జిల్లా...17,26,998
» అల్లూరి సీతారామరాజు జిల్లా...9,53,960



విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనాభా పెరుగుతోంది. గడిచిన ఏడాదితో పోలిస్తే 2.32 శాతం మేర పెరుగుదల నమోదైనట్టు ఏయూలోని జనాభా అధ్యయన కేంద్రం అధికారులు అంచనా వేశారు. గురువారం అంతర్జాతీయ జనాభా దినోత్సవం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా జనాభాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జనాభా 42,90,589 కాగా, ప్రస్తుతం 50,66,616 (విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు కలిపి). అంటే, గడిచిన 14 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో జనాభా సుమారు ఎనిమిది లక్షల మేర పెరిగింది. విభజిత విశాఖ జిల్లా విషయానికి వస్తే గడిచిన ఏడాది 23,31,000 మంది జనాభా ఉండగా ఈ ఏడాదికి ఆ సంఖ్య 23,85,658కి చేరింది. అంటే ఏడాదిలో 54,658 మంది (2.32 శాతం గ్రోత్ రేటు) పెరిగారు. జనాభా రీత్యా రాష్ట్రంలో అతి పెద్ద నగరాల్లో విశాఖపట్నం ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం విభజిత విశాఖ జనాభా మొత్తాన్ని అర్బన్ పాపులేషన్‌గా అంచనా వేశారు. ఇక, అనకాపల్లి జిల్లాలో గడిచిన ఏడాది 17,21,472 మంది ఉండగా ప్రస్తుతం 17,26,998 మంది ఉన్నారు. ఏడాదిలో 5,526 మంది (0.32 శాతం గ్రోత్ రేట్) పెరిగారు. అలాగే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో గడిచిన ఏడాది 9,50,812 మంది ఉండగా, ఈ ఏడాది 9,53,960 మంది ఉన్నారు. ఏడాదిలో 3,148 మంది (0.33 గ్రోత్ రేట్) ... మిగతా 6వ పేజీలో



మెడ్‌టెక్ జోన్‌లో ఇష్టారాజ్యం

ఐదేళ్లుగా అక్కడ ఆయన చెప్పిందే వేదం

» ఎదురు మాట్లాడితే కంపెనీలకు తాళాలే
» ఆడిటింగ్ లేదు...
» ప్రచారం ఎక్కువ...పనితీరు తక్కువ
» గాడిలో పెట్టకపోతే మరింత నిర్వీర్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



మెడ్‌టెక్ జోన్ చంద్రబాబునాయుడి మానస పుత్రిక. వైద్య రంగానికి అవసరమైన ఆధునిక పరికరాలు తయారు చేసేందుకు ఏర్పాటుచేశారు. దేశంలో ఈ తరహా పరిశ్రమ ఇదే మొదటిది. 2016లో నిర్మాణానికి శంకుస్థాపన చేసి అతి తక్కువ సమయంలో పూర్తిచేసి సీఎంగా ఆయనే ప్రారంభోత్సవం కూడా చేశారు. స్టీల్‌ప్లాంటు సమీపాన పెదగంట్యాడ మండలంలో సుమారు 270 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు రూ.500 కోట్లు వెచ్చించారు. కానీ ఆశించిన ప్రగతి లేదు. వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు.

మెడ్‌టెక్ జోన్‌కు అంకురార్పణ జరిగినప్పటి నుంచి ఇప్పటివరకూ ఒకే వ్యక్తి ఆధ్వర్యంలో నడుస్తోంది. ఆయన అదంతా తన సామ్రాజ్యంగా భావించి ఎవరినీ లెక్కచేయడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయన చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదు. దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్నా ఆర్థిక వ్యవహారాలపై సరైన ఆడిటింగ్ లేదు. ఒప్పందాలను సమీక్షించే దిక్కు లేదు. ఎవరితో ఏ రకమైన ఒప్పందం జరుగుతున్నదో...ఆ తరువాత అది ఏమవుతున్నదో పట్టించుకునేవారు లేరు. సంస్థలను రప్పించడానికి కల్లబొల్లి కబుర్లు చెప్పడం, పెద్ద పెద్ద హామీలు ఇవ్వడం, ఆ తరువాత వాటిని అమలు చేయకపోవడం వల్ల అనేక సంస్థలు ఇక్కడి నుంచి వెళ్లిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఏ సంస్థ అయినా వారి హక్కులు గురించి మాట్లాడితే, వెంటనే ఆ కంపెనీకి తాళాలు వేయించి, వేధించడం వంటి పనులు కూడా ఇక్కడ జరుగుతున్నాయంటే...పెట్టుబడిదారులతో ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అసలు ఎన్ని కంపెనీలు వచ్చాయి?, ఎంత టర్నోవర్ జరిగింది?, జోన్‌కు ఎంత లాభం వచ్చింది?, ఉద్యోగ అవకాశాలు ఎంతమందికి కల్పించారు?...అనే విషయాలపై ఈ ఐదేళ్లలో ఎప్పుడు నోరు విప్పి మాట్లాడింది లేదు. నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. వేటిపైనా సరైన విచారణ జరగలేదు. వారం క్రితం కూడా ఓ సంస్థకు తాళాలు వేయించేశారు. ఎంతో నమ్మకంతో వచ్చి ఇక్కడ కోట్ల రూపాయలు పెట్టుబడి పెడితే గొడవపడి పెద్ద పెద్ద కేకలు వేస్తూ చెప్పుకోలేని విధంగా వ్యవహరిస్తున్నారని పెట్టుబడిదారులు వాపోతున్నారు. ఎవరికి ఉద్యోగాలు ఇస్తారో, ఎవరిని ఎందుకు తీసేస్తారో సరైన కారణాలు ఉండవనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరికీ తాము జవాబుదారులం కాదనే తీరుతో వ్యవహారాలు సాగుతున్నాయి. కామన్ సైన్స్ ఫెసిలిటీలు అనేకం ఉన్నాయని భ్రమలు కల్పించి తీసుకువస్తున్నారని, అనేక కంపెనీలు ఉన్నాయని, వస్తాయని, పెద్ద సంఖ్యలో పరికరాల తయారీకి ఆర్డర్లు వస్తాయని ఆశలు కల్పిస్తున్నారని, తీరా ఇక్కడకు వచ్చాక ఆంక్షలు పెట్టి, కంపెనీ నుంచి కాలు బయట పెట్టడానికి కూడా అనుమతి తీసుకోవాలనే విధంగా ... మిగతా 6వ పేజీలో

ఆ 16 ఫైళ్లను వెనక్కి పంపించండి



ఎన్నికల బిజీలో ఉండిపోవడం వల్లే డీమ్డ్ టు బిఅప్రూవ్ అయిపోయాయి

» టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌కు బదిలీపై వెళుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ లేఖ

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు చెందిన ప్రాజెక్టుల్లో లోసుగులు ఉన్నా అభ్యంతరం చెప్పకుండా ప్లాన్ దరఖాస్తులు డీమ్డ్ టు బీ అప్రూవ్ అయ్యేందుకు సహకరించారనే ఆరోపణల నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దిద్దుబాటు చర్యలపై దృష్టిసారించారు. రుషికొండ ఐటీ సెజ్ సమీపంలోని ఎన్‌సీసీకి చెందిన 97.3 ఎకరాల భూమికి సంబంధించి అనేక లోసుగులు, పన్నులు చెల్లింపు జరగాల్సి ఉన్నప్పటికీ ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటుకు అండగా ఉంటాం

ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

» కర్మాగారం పరిస్థితిపై సీఎండీతో సమావేశం
» రాష్ట్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ



ఉక్కు సీఎండీ అతుల్‌భట్, ఉన్నతాధికారులతో సమావేశమైన ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 10: స్టీల్‌ప్లాంటు ప్రగతికి అన్నివిధాలా అండగా ఉంటామని, అందుకోసం కేంద్ర పెద్దలతో మాట్లాడతామని ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్టీల్‌ప్లాంటు ప్రస్తుత పరిస్థితిపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులతో కలిసి కర్మాగారంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాంటులో ప్రస్తుత పరిస్థితులను సీఎండీ అతుల్‌భట్, డైరెక్టర్‌లు, ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సెయిల్‌లో విలీనం చేస్తే ప్లాంటు పరిస్థితి ఏ విధంగా ఉంటుందనే అంశంపై చర్చ జరిగింది. రాష్ట్రంలోని గనుల లీజును పునరుద్ధరించాలని, విద్యుత్ బిల్లులు చెల్లింపులో కొంత వెసులుబాటు ఇవ్వాలని, కేంద్ర సహకారం కావాలని ఉన్నతాధికారులు కోరగా...రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ఏం కావాలన్న చేస్తామని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం స్టీల్‌ప్లాంటులో పర్యటించనున్న కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకువెళ్లాల్సిన ప్రధాన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రైవేటీకరణ ఉపసంహరణ, ప్లాంటుకు ... మిగతా 6వ పేజీలో

ఎర్నిమాంబ ఆలయ హుండీ లెక్కింపు

అల్లిపురం, జూలై 10: అచ్చియ్యమ్మపేట గ్రామ దేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయశాఖ అధికారి బి.వంసత కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. శ్రీహరిసేవా సంఘం సహకారంతో ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో మే 22నుంచి జూలై 10 వరకు మొత్తంరూ.21, 03,182 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబా తెలిపారు.

స్టేషన్ల నుంచి వాహనాల తరలింపు

సీతంపేట, జూలై 10: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలో పలు కేసులు పట్టుబడిన, దొంగతనం కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను మధురవాడలో యార్డ్‌కి తరలించారు. స్టేషన్‌లో వాహనాలు మూలకు చేరడంతోపాటు తుక్కుపట్టి పోతుండడంతో వాటిని యార్డ్‌కి తరలించారు.

50,66,616

... 5వ పేజీ తరువాయి

పెరిగారు. మూడు జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా చూస్తే గడిచిన ఏడాది 50,03,284 మంది జనాభా ఉండగా,ఈ ఏడాదిలో50,66,616కు (63,332 మంది పెరిగారు) చేరారు. ఏయూలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌లోరీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్‌గా డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ వై.రమణ, రీసెర్చ్ ఫెలోస్ డాక్టర్ సీహెచ్‌పాదాలు, శ్రీనివాస్ పని చేశారు.

వేగంగా అర్బనైజేషన్

-ప్రొఫెసర్ బి.మునిస్వామి, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్

ఏటా జనాభా భారీగా పెరుగుతోంది. 2011 లెక్కలను ప్రామాణికంగా తీసుకుని ఏటా జనాభా పెరుగుదలను అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా దేశంలో అర్బనైజేషన్ వేగంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పనపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రస్తుతం దేశంలో 36.3 శాతం అర్బన్ పాపులేషన్ ఉంది. రానున్న పదేళ్లలోభారీగా పెరగవచ్చు.రోడ్లు, ఇళ్లు, తాగు నీరు, వైద్యంవంటి సదుపాయాలను పెంచాల్సి ఉంది.లేకపోతే అనేకరకాల ఇబ్బందులు తలెత్తవచ్చు.

కైలాసపురం-మాధవధార రూట్‌లో కొత్త బస్సు సర్వీసు

▸▸ 48 ఎస్ నంబరుతో సింహాచలం నుంచి ఆర్‌కే బీచ్ వరకు సదుపాయం

మురళీనగర్, జూలై 10; నగరంలో ఆర్టీసీ ప్రయాణికుల ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరింది. ఉత్తర నియోజకవర్గంలో పలుప్రాంతాలను కలుపుతూ సింహాచలం నుంచి ఆర్కే. బీచ్ వరకు కొత్త బస్సు సర్వీసుని వాల్తేరు డిపో ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజరు సుధాకర్ సర్వీసు ప్రారంభించారు.

భలే ఉపయోగం

జాతీయరహదారిపైన కైలాసపురం ఎగువ రహదారిలో దాదాపు రెండు దశాబ్దాలుగా ఒకే బస్సు 48ఏ నంబరుతో నడుస్తోంది. పాత పోస్టాఫీసు నుంచి జగదాంబ, ఆర్టీసీ కాంప్లెక్స్, అక్కయ్యపాలెం దాటి పోర్టు హాస్పిటల్ ఎదుట నుంచి ఇనార్బిట్ రోడ్డులోకి వచ్చి పై రోడ్డు కైలాసపురం, మురళీనగర్, మాధవధార వరకు ఇది నడుస్తోంది. 48ఏ రోజుకి ఎనిమిది ట్రిప్పులు తిరుగుతుంది. మొత్తం 12 కిలోమీటర్ల దూరం గల బస్సులో టికెట్ రూ.25 గరిష్ఠ ధరగా ఉంది. ఆరు బస్సులు తిరుగుతున్నాయి. అయితే, ఇటీవల విస్తరించిన విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రాంతాలకు కొత్త సర్వీసు అవసరమని ఎన్నాళ్ల నుంచో పలువురు కోరుతున్నారు. దీనితో కదలిక వచ్చిన ఆర్టీసీ యాజమాన్యం ఇన్నాళ్లకు మాధవధార రూట్‌లో కొత్త బస్సు వేసింది. ఈ కొత్త బస్సు సర్వీసు సింహాచలం నుంచి ఆర్కే. బీచ్ వరకు నడుపుతున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. సింహాచలం నుంచి బయలు దేరి గోపాలపట్నం, ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి హైవే మీదుగా ఆర్ అండ్‌బీ జంక్షన్ వద్ద మారియట్ హోటల్ నుంచి మాధవధార ఉడాకాలనీ చేరుతుంది. ఇక్కడి నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు, కైలాసపురం, పోర్టు హాస్పిటల్ మీదుగా తిరిగి హైవే రోడ్డునుంచి అక్కయ్యపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సు, జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టర్ ఆఫీసు మీదుగా ఆర్కేబీచ్ చేరుతుంది. సింహాచలంలో నుంచి ఆర్కే. బీచ్ వరకు నడిచే ఈ కొత్త 48ఎస్ రూట్ బస్సు ధర రూ. 30లుగా నిర్ణయించారు. కనీస టికెట్ పది రూపాయలు. ప్రస్తుతం రెండు బస్సులు ఉదయం, సాయంత్రం మూడు ట్రిప్పులు చొప్పున నడపనున్నట్టు వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు.



కొత్తగా వేసిన 48 ఎస్ రూట్ ఆర్టీసీ బస్సు

విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి

▸▸ సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

సీతంపేట, జూలై 10: విద్యార్థి దశ నుంచే దైవభక్తిని, దేశభక్తిని పెంపొందించుకోవాలని సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జాతీయ సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత్ వికాస్ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం, పక్షోత్సవాల ముగింపు ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు భారత్ వికాస పరిషత్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ర జైన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను తాము ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ విశాఖపట్నం ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారిమాణిక్యాలరావు, జాన్సీ, లక్ష్మీబాయి, షర్మిల పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ

అల్లిపురం, జూలై 10: జీవీఎంసీ 33వార్డు పరిధిలోని వెంకటేశ్వరమెట్ట వద్దనున్న గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న శ్రీ వెంకట గౌరీశంకర్ గ్రంథాలయానికి 25 కుర్చీలను దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు 32 వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్ రావు, కందుల నళిని బద్రీనాథ్, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

'రైతు బజారులో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'



సీతమ్మధార రైతుబజార్‌లో వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార, జూలై 10: రైతుబజార్‌లో అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే సహించేదిలేదని అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి హెచ్చరించారు. సీతమ్మధార రైతు బజారులో రైతులు వారికి ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని, దీనిపై బజార్ ఎస్టేట్ అధికారి పట్టించుకోవడం లేదని ఓ కొనుగోలుదారుడు ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌డీవో ఆదేశాల పై తహసీల్దార్ శ్రీరామమూర్తి, హార్టీకల్చర్ కార్యాలయం ప్రతినిధి పి.త్రినాథ్, ఏడీ మార్కెటింగ్ సీనియర్ అసిస్టెంట్ ఎంవీ నాగేశ్వరరావు తదితరులు బుధవారం రైతు బజారును సందర్శించారు. రైతులతోపాటు బజార్‌కి వచ్చినకొనుగోలుదారులతో మాట్లాడారు. ముందుగా రైతుబజార్‌లో స్టాల్స్ ఎన్ని ఉన్నాయో తెలుసుకున్నారు. బినామీలు, దళారులపై ఆరా తీశారు. స్టాల్స్‌లో రైతులు అమ్మకాలు చేస్తున్న కూరగాయలు, వాటి ధరలు బోర్డులో ధరలు పరిశీలించారు. బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబునుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఇబ్రహీం, వీఆర్ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైజాగ్ గ్రీన్స్‌పై భీమిలి జట్టు భారీ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 10: వీడీసీఏ వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన ఐదో డివిజన్ తొలి మ్యాచ్‌లో అసోసియేషన్ ఆఫ్ భీమిలి 150 పరుగుల భారీ తేడాతో వైజాగ్ గ్రీన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమిలి 42.1ఓవర్లలో 276 పరుగులు చేసింది. ప్రసాద్ అద్భుతమైన బ్యాటింగ్‌తో సెంచరీ (108) సాధించగా.. నరేష్ 42 పరుగులతో రాణించాడు. లక్ష్య ఛేదనలోవైజాగ్ గ్రీన్స్ 34 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. మరో మ్యాచ్‌లో గ్రాడ్యుయేట్స్ 118 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రాడ్యుయేట్స్ 42.3 ఓవర్లలో 234 పరుగులు చేసింది. యోగి (70), వినయ్‌కుమార్ (69) హాఫ్ సెంచరీలు చేశారు.జింక్ గ్రౌండ్‌లోజరిగిన ఆరో డివిజన్ మ్యాచ్‌లో ఆశ్రయ సీసీ ఏడు వికెట్ల తేడాతో మాక్స్‌వెల్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మ్యాక్స్‌వెల్ 43 ఓవర్లలో ఏడు వికెట్లకు 251 పరుగులు చేసింది. జట్టులో శ్యామ్‌కుమార్ (83), అన్వేష్ (61) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆశ్రయ సీసీ 31.4 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 252 పరుగులుచేసివిజయం సాధించింది.జట్టులోమణికంఠ సెంచరీతో (114)రాణించి జట్టుకు విజయాన్నందించాడు.

బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన శ్రీను



విజేత శ్రీనును సత్కరిస్తున్న సభ్యులు

అక్కయ్యపాలెం, జూలై 10: ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జీజీకే బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన కలిశెట్టి శ్రీను ర్యాంకర్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో స్టేట్ ప్రో బాక్సింగ్ కౌన్సిల్ క్లబ్ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. శ్రీను సూపర్ బాం టమ్ కేటగిరిలో పాల్గొని ప్రత్యర్థి తెలంగాణ బాక్సర్ వివేక్‌ను నిమిషం 38 సెకన్లలో నాకౌట్ చేసి విజయం సాధించారు. 20వ ర్యాంకర్‌గా నిలిచిన శ్రీనును స్టేట్ ప్రో బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు యల్లపు రఘురాం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 22న జరిగే ప్రపంచ బాక్సింగ్ పోటీలకు శ్రీను ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సర్లు అమ్మోరు, పృథ్వీ, ఐబీసీ రిఫరీలు రామారావు, రూబెన్, విశాఖ పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, కృష్ణారెడ్డి, సునీల్, సతీష్, గోపాల్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు గంగవరం పోర్టు ఆర్థిక సాయం



కలెక్టర్‌కు రూ. 90లక్షల చెక్కును ఇస్తున్న పోర్టు యాజమాన్యప్రతినిధి

విశాఖపట్నం, జూలై 10: కేజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అదానీ గంగవరం పోర్టు రూ.90 లక్షలు ఆర్థిక సాయం అందించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చెక్కును గంగవరం పోర్టు ప్రతినిధి బుధవారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు. పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్‌యూనిట్‌లో మెరుగైన సదుపాయాల కల్పనకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. స్థానిక పిల్లలకు, కుటుంబాలకు సాధ్యమైన మేర ఉత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా అదానీ ఫౌండేషన్, గంగవరం పోర్టు పనిచేస్తున్నాయన్నారు. పేదలకు మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, ఆరోగ్య సంరక్షణ కల్పించడమే లక్ష్యమన్నారు.

సెంట్రల్ పార్కులో వసతుల పరిశీలన



పార్కులో పర్యటిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ రవీంద్ర

డాబాగార్డెన్స్, జూలై 10: గ్రేటర్ 31వ వార్డుసెంట్రల్ పార్కులో వీఎంఆర్డీఏ కమిషనర్ రవీంద్ర బుధవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. మరమ్మతుకు గురైన చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, సైన్‌బోర్డులను బాగు చేయించాలని, నడక దారిలో పాడైన టైల్స్‌ను మార్చాలని కోరారు. ఈపర్యటనలో సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ బేగం పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎంపీలు

సీతమ్మధార, జూలై 10: ఆర్ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఆర్ఎంపీల అసోసియేషన్ డిమాండ్ చేసింది. నగరంలోని డైమండ్ పార్కు వద్ద ఓ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఆర్ఎంపీల సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ మారుమూల ప్రాంతాలు, ఏజన్సీ ప్రాంతాల్లో ఎంతో మంది ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గ్రామీణ వైద్యులకు మేలు చేకూరేలా 429 జీవో 2008లో ఇచ్చారని, అయితే, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలో గ్రామీణ వైద్యులు సుమారు 9 వేల మంది ఉన్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకుని ఈ జీవోను పునరుద్ధరించాలని కోరారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ కార్యదర్శి ఎస్.సుగణేశ్వరి, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ సంఘం సలహాదారులు కోన ప్రకాష్, సమన్వయకర్త కళ్యాణి, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లోగిశ గణేష్, పచ్చిపులుసు కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విశాఖ!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. భీమిలి సమీపంలో సుమారు 50 ఎకరాలను యజమానుల నుంచి వైసీపీ కీలక నేతలు బలవంతంగా తక్కువ ధరకు లాగేసుకున్నారు. అలాగే రేడియంట్, ఎన్‌సీసీ ప్రాజెక్టులు సొంతం చేసుకున్నారు. రుషికొండపై పర్యాటక కాటేజీలు కూల్చివేసి, ప్రజాధనంతో అత్యంత విలాసవంతమైన భవనం నిర్మించేసుకున్నారు. రూరల్ ప్రాంతంలో డీఫారం భూములను కాజేయడానికి వీలుగా జీవో 596 తీసుకువచ్చి, కోట్ల విలువైన భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు సాధించారు. ఇలా గడచిన ఐదేళ్లలో రమారమి 50 వేల కోట్ల విలువైన భూములు, ప్రాజెక్టులను వైసీపీ నేతలు, పెద్దలు చేజిక్కించుకున్నారనేది బహిరంగ రహస్యం.

ప్రాభవం కోల్పోయిన నగరం

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా విశాఖకు పలు ఐటీ కంపెనీలు వచ్చాయి. ఇందుకోసం ఐటీ టవర్లు నిర్మించారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అదానీ వంటి పెద్ద సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఐటీ కార్యకలాపాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ కంపెనీ తరలిపోయింది. నాలుగేళ్ల తరువాత అదానీ తిరిగి వచ్చి, శంకుస్థాపన చేసినా ఇంతవరకూ పనులు ప్రారంభించలేదు. పలు ఐటీ కంపెనీలు విశాఖ నుంచి వెళ్లిపోయాయి. కొత్తవి రావడానికి బెదిరిపోయాయి. పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. కొత్తగా ఒక్క ప్రాజెక్టు రాలేదు. అలాగే చంద్రబాబునాయుడు హయాంలో ఆర్కే బీచ్‌రోడ్డు సమీపాన గల ఏపీఐఐసీ భూమిలో భారీ మాల్ నిర్మాణానికి 'లులూ' సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తగిన సహకారం అందించకపోవడంతో లులూ విశాఖకు బైబై చెప్పేసింది.

ఏయూకు వైసీపీ చీడ

నగరంలో పేరొందిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వైసీపీ కార్యాలయంగా మారిపోయింది. ఇక్కడ జరిగినన్ని అక్రమాలు రాష్ట్రంలో మరే విశ్వవిద్యాలయంలోనూ జరగలేదనేది వాస్తవం. అదేవిధంగా పారిశ్రామికంగా విస్తరించే క్రమంలో మెట్రో రైలు ప్రాజెక్టు ఐదేళ్లలో అతీగతీ లేదు. గత పాలకులు కావాలనే మెట్రో ప్రాజెక్టును మూలనపడేశారనే వాదన ఉంది. విశాఖలో గంజాయి సంస్కృతి దారుణంగా పెరిగిపోయింది. రౌడీమూకలు చెలరేగిపోయారు. ఏడాది క్రితం ఎంపీ కుటుంబ సభ్యుల్నే కిడ్నాప్ చేయడం దేశంలోనే కలకలం రేపింది.

బాబు భరోసాతోనే భవిత

విభజిత రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా నగరానికి వస్తున్న చంద్రబాబునాయుడుపైనే విశాఖ ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి కొత్త కంపెనీలు, ప్రాజెక్టులను తీసుకురావాల్సి ఉంది. ఇందుకోసం పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు, ఐటీ నిపుణుల్లో భరోసా కల్పించాలి. పెండింగ్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాల్సిన బాధ్యత బాబుపైనే ఉంది. గురువారం సాయంత్రం పలు శాఖలకు చెందిన ప్రాజెక్టులు, పెండింగ్ పనులపై విమానాశ్రయంలో అధికారులతో చంద్రబాబు సమీక్షించనున్నారు. ఇందులో భాగంగా విశాఖకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకుంటారని నగరవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కుపై వివక్ష

... 5వ పేజీ తరువాయి

చార్జీలు ఎంత వసూలు చేస్తున్నారు?, వాటిని ఎంత పెంచాలి?, ఇతర ఆస్తులను లీజుకు ఇస్తే ఎంత ఆదాయం సమకూరుతుంది?...తదితర అంశాలపైనే ఉక్కు మంత్రిత్వ శాఖ సమీక్షలు నిర్వహిస్తోంది. కార్మికులు, ఉద్యోగులు ఆలస్యంగా వస్తే ఎంతమందికి షోకాజ్‌లు ఇచ్చారు?...ఇలాంటిఅంశాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది.

విశాఖ స్టీల్‌ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 74 లక్షల టన్నులు. సుమారు రూ.25 వేల కోట్లు వెచ్చించి విస్తరణ ద్వారా యంత్ర సామగ్రిని, ఇతర వసతులు సమకూర్చుకుంది. గత రెండేళ్లలో ఒక్కరోజు కూడా వీటిని పూర్తిస్థాయిలో వినియోగించలేదు. అవన్నీ వృథాగా ఉన్నాయి, సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేస్తే వ్యయం తగ్గుతుంది. అంతకంటే తక్కువ చేస్తే ఆ వ్యయం పెరుగుతుంది. లాభాలు తగ్గిపోతాయి. నష్టాలు పెరుగుతాయి. ప్రస్తుతం విశాఖ ప్లాంటు ఆ కారణం వల్లేనే నష్టాల్లో కూరుకుపోయింది. మూడు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఒకటి పూర్తిగా మూసేశారు.

రూ.2,300 కోట్లు పప్పుబెల్లాల్లా ఖర్చు చేసేశారు

మూడో బ్లాస్ట్ ఫర్నేసును వినియోగంలోకి తెస్తామని ప్రకటించి జిందాల్ నుంచి రూ.800 కోట్ల రుణానికి ఒప్పందం చేసుకున్నారు. ఆ సంస్థ రూ.100 కోట్లు, రూ.200 కోట్లు చొప్పున గత ఏడాది కాలంలో రూ.1,500 కోట్లు వచ్చాయి. మరోవైపు టాటా స్టీల్ కూడా రూ.800 కోట్లు రుణం ఇచ్చింది. ఇవన్నీ ఒకేసారి అంది ఉంటే ఆ రూ.2,300 కోట్లతో మూడో బ్లాస్ట్ ఫర్నేసును విజయవంతంగా వినియోగంలోకి తీసుకువచ్చేవారు. కానీ అలాకాకుండా వంద, రెండు వందల కోట్లు చొప్పున వారి నుంచి తీసుకోవడం వల్ల ఆ నిధులన్నీ చిల్లర ఖర్చులకు అయిపోయాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేసు అలాగే మూతపడి ఉంది. ఈప్లాంటును పూర్తిస్థాయిలో పనిచేయించడానికి ఇప్పటివరకూ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఎటువంటి సాయం చేయలేదు.

ఇప్పుడు ఐరన్‌ఓర్ ఇవ్వబోమని హెచ్చరికలు

ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లాలో భారీఎత్తున ఐరన్‌ఓర్ గనులు ఉన్నాయనే కారణంతోనే నాడు విశాఖలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్యానికి ముందే కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్ ఉంది. ఆ మార్గంలో ఐరన్‌ఓర్ తెచ్చుకొని విశాఖలో స్టీల్ ఉత్పత్తి చేయవచ్చునని ఇక్కడ ప్లాంటు పెట్టారు. ఇంకో 200 ఏళ్లు తవ్వినా అక్కడి గనులు తరిగిపోవు. దానిని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఎండీసీ నిర్వహిస్తోంది. వారి నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఐరన్‌ఓర్ తెచ్చుకుంటోంది. ఇప్పుడు ఆ ఐరన్‌ఓర్‌పై ఆశలు పెట్టుకోవద్దంటూ కేంద్ర ఉక్కు శాఖ జాయింట్ సెక్రటరీ, విశాఖ ఉక్కు ప్రభుత్వ డైరెక్టర్ అయిన సంజయ్ రాయ్ గత మూడు నెలలుగా విశాఖ ఉక్కు అధికారులను హెచ్చరిస్తున్నారు. ఎన్ఎండీసీ ఇకపై ఓర్ సరఫరా చేయదని, కర్ణాటక నుంచి తెప్పించుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ఆ విధంగా చేస్తే టన్నుకు రూ.2 వేలు ఖర్చు అవుతుంది. అంతేకాకుండా కర్ణాటక నుంచి ఐరన్‌ఓర్ తెచ్చుకోవాలంటే...అక్కడి ప్రభుత్వానికి ప్రత్యేకమైన సెస్‌లు చెల్లించి, పర్యావరణ అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఇందుకోసం ఒక ఉన్నతాధికారిని నియమించుకోవలసి ఉంటుంది. ఇవన్నీ కాకుండా రవాణా వ్యయం మరింత పెరుగుతుంది.

ఆస్తులు అమ్మినా రూపాయి ఇవ్వడం లేదు

నిరర్థక ఆస్తుల పేరుతో ఎక్కడెక్కడో ఉన్న ఆస్తులు అమ్మేస్తున్నారు. వాటి ద్వారా వచ్చిన దాంట్లో రూపాయి కూడా ప్లాంటుకు ఇవ్వడం లేదు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటును రైల్వేకు రూ.2 వేల కోట్లకు విక్రయించారు. దానిపై ఉన్న రూ.1,200 కోట్ల రుణాలు పోను మిగిలిన రూ.800 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మొత్తం బ్యాంకులో వేయగానే...వివిధ బ్యాంకుల ద్వారా ఆ మొత్తాన్ని కూడా బ్లాక్ చేయించేశారు. తమ వద్ద విశాఖపట్నం స్టీల్ ప్లాంటు రుణాలు తీసుకుందని, వాటికి జమ చేసుకుంటామని చెప్పి వాటిని తీసేసుకున్నాయి. విశాఖపట్నంలో భూముల విక్రయం ద్వారా రూ.450 కోట్లు వరకు సమకూరాయి. అవీ ఇవ్వలేదు. ఇప్పుడు హైదరాబాద్, చెన్నైలలో స్టాక్‌యార్డులను విక్రయానికి పెట్టారు. వాటి ద్వారా మరో రూ.450 కోట్లు సమకూరతాయి. ఇవన్నీ వివాదాల్లో ఉన్నాయని పక్కన పెడుతున్నారు. ముడిపదార్థాల కొనుగోలుకు నిధులు లేక, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయలేక ప్లాంటు యాజమాన్యం నానా పాట్లు పడుతోంది. నిలదిక్కుకోవడానికి కేంద్రం తరఫున ఎటువంటి సాయం అందడం లేదు. కర్ణాటకలో మూతపడిన స్టీల్‌ప్లాంటును తెరిపిస్తామని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి చెబుతున్నారు గానీ విశాఖ ఉక్కును గట్టెక్కిస్తామని మాత్రం చెప్పడం లేదు. ఏపీ ప్రభుత్వం నుంచి గట్టి ఒత్తిడి తేనంతవరకు ఇదే దుస్థితి కొనసాగుతుంది.

కాగా, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం విశాఖపట్నం వచ్చారు. గురువారం స్టీల్‌ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎటువంటి ప్రకటన చేస్తారోననే అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

స్టీల్‌ప్లాంటుకు అండగా ఉంటాం

... 5వ పేజీ తరువాయి

ఆర్థిక సహాయం, ప్రోత్సాహం, భవిష్యత్తులో మరింత ప్రగతి కోసం చేపట్టాల్సిన చర్యలు, ఉద్యోగుల ప్రధాన సమస్యలు వంటి అంశాలపై చర్చించారు.

ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తాం

ఐదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ఏమీ చేయలేదని, ఇప్పుడు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపే విధంగా వ్యవహరిస్తున్నదని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఆయన స్టీల్‌ప్లాంట్ మల్టీపర్పస్ హాల్‌లో బుధవారం కార్మిక సంఘ నాయకులతో మాట్లాడారు. ఏ ఆధారం లేకుండా కొన్ని ఆంగ్ల పత్రికల్లో స్టీల్‌ప్లాంటు అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా చూడడంతోపాటు ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఉద్యోగులకు, నిర్వాసితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషిచేస్తామన్నారు. ప్లాంటులో ప్రస్తుతం సగం ఉత్పత్తి మాత్రమే జరుగుతుందని, పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగే విధంగా కేంద్రం నుంచి సహకారం తీసుకుంటామన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రం తరఫున ప్లాంట్‌కు అన్నివిధాలా మద్దతు ఉంటుందన్నారు. ఏం కావాలన్నా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అన్ని నిర్మాణాలు ఒక్కరికే

ఇక్కడ వివిధ సంస్థలకు భూమి కేటాయిస్తారు. వారు నిర్మాణాలు చేసుకోవడానికి టెండర్లు ఆహ్వానిస్తారు. కానీ వాటిని పక్కకునెట్టి ఒకరికే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తారు. అందులో మతలబు ఏమిటనేది అర్థం కాదు. జోన్ ప్రారంభించినప్పుడు ఒక సంస్థ నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. వారి దగ్గర పనిచేసే ముఖ్యమైన వ్యక్తిని తీసుకొని, ఇప్పుడు ఆయనకే అన్ని కాంట్రాక్టులు ఇప్పిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ ఆర్థిక వ్యవహారాలు సరిగ్గా లేవు. ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నామని నిర్మాణాలు చేపడుతుంటారు. కానీ వాటి ఫలితం ఎక్కడా కనపడదు. సమావేశాలు నిర్వహించడం, పెద్దగా అరవడం, ఎవరైనా ఏదైనా ప్రశ్నిస్తే వారిని బయటకు పంపేయడం...ఇదే తరహాలో వ్యవహారాలు సాగుతున్నాయి. ఇక్కడ ఏర్పాటయ్యే కంపెనీలు భూమిని లీజుకు తీసుకుంటాయి. డబ్బులు చెల్లిస్తాయి. అవన్నీ ఎక్కడికి వెళుతున్నాయనే దానికి సరైన లెక్కలు లేవు. పరిశ్రమలు పెట్టేవారికి ఇబ్బందులు ఉండకూడదని సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తుంటే...వాటిని ఇక్కడ దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులెవరినీ రానివ్వకపోవడం, పరిశ్రమల శాఖ అధికారులకూ సరైన సమాచారమివ్వక పోవడం వంటి లోపాలు ఉన్నాయి. గురువారం వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ జోన్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి ప్రక్షాళన చేయకపోతే ఆశించిన ప్రయోజనం చేకూరదు. కరోనాలోమాస్కులు తయారు చేశామనే, ఆక్సిజన్ అందించామనే కబుర్లు కాకుండా వైద్య రంగానికి ఉపయోగపడే పరికరాలుఏమి తయారుచేశారో,ఎంత ఉత్పత్తి జరిగిందో, ఎన్ని పెట్టుబడులు వచ్చాయో, ఎంతమందికిఉపాధి కల్పించాలో అక్కడిఅధికారులు చెప్పాల్సిన అవసరం ఉంది.

ఆ 16 ఫైళ్లను వెనక్కి పంపించండి

... 5వ పేజీ తరువాయి

విల్లాల నిర్మాణానికి జీవీఎంసీ కమిషనర్ సహకరించారంటూ జనసేన, టీడీపీ నేతలు ఆరోపించారు. ఆ ఫైలును తిరస్కరించకుండా తన వద్ద పెండింగ్‌లో పెట్టుకోవడం ద్వారా డీమ్డ్ అప్రూవ్ అయ్యేందుకు తోడ్పడ్డారని విమర్శించారు. అలాగే పాపయ్యరాజుపాలెం వద్ద సర్వే నంబర్ 114/2లోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ దరఖాస్తుపై ఏసీపీ స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా...తిరస్కరిస్తారని ఉద్దేశంతో ఆ ఫైలును తనకు పంపాలని కింది స్థాయి అధికారులను ఆదేశించి తన లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచేశారన్నారు. దీని వల్ల ఆ ప్లాన్ డీమ్డ్ టు బి అప్రూవ్ అయిపోయింది. అలాగే మద్రిపాలెంలో 'కరన్ ఉద్యోగ్ డెవలపర్స్' సంస్థ నాలుగు ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టుకు కూడా ప్లాన్ డీమ్డ్‌అప్రూవల్ అయిపోయింది. ఇంకా పరవాడలో ప్రకృతి అవెన్యూ, అనకాపల్లి సమీపంలోని కొప్పాక వద్ద సర్వేనంబర్ 17/పీలో, మల్కాపురంలోని సర్వేనంబర్ 42/పీ, 42/1పీలో 20,292 చదరపు మీటర్లలో నిర్మిస్తున్న ప్రాజెక్టు, ధారపాలెంలోని సర్వేనంబర్ 3/1లో 1003 చదరపు మీటర్లలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో బోలెడు లొసుగులున్నా వాటి ప్లాన్‌లన్నీ అప్రూవ్ అయిపోయాయి. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో డీమ్డ్ అప్రూవ్ అయిపోయిన 16 ప్రాజెక్టులకు సంబంధించిన ప్లాన్‌లను వెనక్కి పంపించాలంటూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయానికి ఈనెల 8న కమిషనర్ లేఖ రాశారు. గత మార్చి 13 నుంచి ఎన్నికల కోడ్ రావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులంతా బిజీ అయిపోయారని, అందువల్లే అవన్నీ డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని లేఖలో పొందుపరిచారు. ఆయా ఫైళ్లను పరిశీలించాల్సి ఉన్నందున వెనక్కి పంపాలంటూ ఆర్‌టీఎస్ పెట్టారు.

జీర్ణావస్థలో జంతు వధశాల

పదేళ్లుగా పూర్తి స్థాయిలో జరగని కార్యకలాపాలు

ఇష్టానుసారంగా తమ దుకాణాల వద్దే మేకలు, గొర్రెలను వధిస్తున్న మటన్ వ్యాపారులు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు



కర్ణవానిపాలెంలోని జంతు వధశాల

గాజువాక, జూలై 10: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో జంతు వధశాల (కబేళా) అందుబాటులో లేక మటన్ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి జంతు వధశాలలో మేకలు, గొర్రెలను వధించే ముందు అక్కడ ఉన్న సిబ్బంది వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి ఆమోద ముద్ర వేయాలి. అటువంటిది గత పదేళ్లుగా జంతు వధశాలలో కార్యకలాపాలు పూర్తి స్థాయిలో జరగకపోవడం వల్ల కొంతమంది మటన్ వ్యాపారులు తమ దుకాణాల వద్దే మేక, గొర్రెలను వధిస్తున్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి సంబంధించి ఆయా జంతువులను వధించే నిమిత్తం కర్ణవానిపాలెంలో 2008లో ఆధునిక కబేళాను ఏర్పాటు చేశారు. రెండు మూడేళ్ల పాటు ఈ కబేళాలో కార్యకలాపాలు సవ్యంగా సాగినప్పటికీ, ఆ తర్వాత దీనిని వినియోగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఈ భవనం ప్రస్తుతం జీర్ణావస్థకు చేరుకుంది.

పారిశ్రామిక ప్రాంతంలోని సింధియా నుంచి లంకెలపాలెం ప్రాంతం వరకు సుమారుగా వెయ్యికి పైగా మటన్ దుకాణాలు ఉన్నాయి. అయితే గతంలో మేకలు, గొర్రెలను వధించే ముందు హనుమంతవాక సమీపంలో ఉన్న కబేళాకు రావాలని వ్యాపారులను అధికారులు ఆదేశించారు. గాజువాక ప్రాంతానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో హనుమంతవాక వెళ్లేందుకు మటన్ వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పాటు గాజువాకలోనే కబేళాను కొనసాగించాలని కోరారు. అందుకు అధికారులు నిరాకరించడంతో చాలామంది మటన్ వ్యాపారులు ఎవరికి వారు తమ షాపుల వద్దే బహిరంగంగానే మేకలు, గొర్రెలను వధిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న మేకలు, గొర్రెలను కూడా వధిస్తూ వాటి మాంసాన్ని ప్రజలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్ల అధికారులు స్పందించి గాజువాకలోని కబేళాకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువాలని ప్రజలతో పాటు పలువురు మటన్ వ్యాపారులు కూడా కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు



ధర్నాలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి

కేంద్ర మంత్రి ప్రకటన చేయాలి

ఇంటక్ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 10: స్టీల్‌ప్లాంట్ పర్యటనకు విచ్చేస్తున్న కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. విశాఖ పర్యటనలో కేంద్ర మంత్రి స్టీల్‌ప్లాంటుపై ప్రకటన చేయాలని కోరారు. ఈ విషయమై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, అవతారం, దేముడు, శ్రీనివాసరావు, మోహన్, వేణువర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం దుర్మార్గ ఆలోచనలను విడనాడాలి

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దుర్మార్గ ఆలోచనలను విడనాడాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ప్లాంట్ పరిపాలన భవనం జంక్షన్ వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిని ఎలా పెంచాలో యోచించకుండా కార్మికులను ఎలా ఇబ్బందులకు గురి చేయాలోనని యాజమాన్యం ఆలోచిస్తుందని మండిపడ్డారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తిలో నడిపేందుకు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా ఉక్కు ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సంఘం పోస్టర్ ఆవిష్కరణ

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలంటూ ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు బుధవారం ఉక్కు సీ-భవన్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తీవ్రమైన వర్కింగ్ క్యాపిటల్ వల్ల ముడిసరకు కొనలేక భారీగా ఉత్పత్తిని, రెవెన్యూను ప్లాంట్ కోల్పోతుందన్నారు. గతంలో గంగవరం పోర్టు కార్మికుల సమ్మె వల్ల రూ.వేల కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ ప్రభావంతో ఇప్పుడు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ప్లాంటుకు వచ్చిందన్నారు. ఈ నెల 14న ఉక్కు అమరవీరులకు క్యాండిల్ జంక్షన్ వద్ద నివాళులర్పించాక సీ-భవన్‌కు ర్యాలీగా చేరుకుని ఉక్కు విలీన దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ప్రతినిధులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్, చంద్ర వెంటేశ్వరరావు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం, జూలై 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం భెల్ హెచ్‌పీవీపీ మెయిన్ గేటు ఎదుట కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ భెల్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించినప్పుడే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవడంతో పాటు కార్మికుల హక్కులను కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘ నాయకులు ఎస్.సాహు, పీవీఎస్ రాజు, కొల్లి దేముడు, ఉరుకూటి బాబూరావు, ఎస్.జగన్నాథరావు, ఆనందరావు, సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మింది స్కూల్‌ను సందర్శించిన డీఈవో చంద్రకళ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

అక్కిరెడ్డిపాలెం, జూలై 10: మింది హైస్కూల్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేయడంతో పాటు వారికి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్కూల్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. ఆమె వెంట సహాయ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, హెచ్ఎం పీవీజీ ఆంజనేయ, ఇతర సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం

అగనంపూడి, జూలై 10: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశమవుతాయని దువ్వాడ ఎస్ఐ డేవిడ్ పేర్కొన్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను పెంచుతూ మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, అందువల్ల విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే ఎదురయ్యే దుష్పరిణామాలను డేవిడ్ వివరించారు. కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ సంస్థ జిల్లా చైర్మన్ మోటూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ సుధాకర్, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, హనుమంతరావు, విందుల నారాయణరావు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో నీటి సరఫరాకు నేడు అంతరాయం

కూర్మన్నపాలెం, జూలై 10: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి హైస్కూల్ వద్దనున్న ఓవర్ హెడ్ ట్యాంకు ప్రధాన వాల్వులకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం వార్డులో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి తమకు సహకరించాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వేపగుంట జూలై 10: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీ లేఅవుట్ 2లో పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ క్లైమేట్ టీమ్ (ఎన్‌జీఓ), వాకర్స్ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి మాట్లాడుతూ, మొక్కల పెంపకంతోనే సమస్త జీవరాశి మనుగడ సాధ్యమన్నారు. కాలనీలో సుమారు 60 చెట్లను నాటారు. పోర్టు విశ్రాంత ఇంజనీర్ జనార్దన్, అడ్వకేట్ సూర్యనారాయణ, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, గోపాల్, రమేష్‌రెడ్డి, హరిదాసు, ప్రకాశ్‌లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు తరలిరావాలి: 'నల్లూరు'

కూర్మన్నపాలెం, జూలై 10: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా గురువారం విశాఖ వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు టీడీపీ 86వ వార్డు శ్రేణులు, కూటమి నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించే కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

గోపాలపట్నం, జూలై 10: గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పాడేరు సమీపంలోని ఏవోబీ నుంచి మూడు కిలోల లిక్విడ్ గంజాయి, 1.5 కిలోల గంజాయితో వారు వస్తుండగా టాస్క్‌ఫోర్స్, గోపాలపట్నం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులైన ఎస్ఏడీ కాకానీనగర్‌కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్‌తో పాటు మరో బాలుడిని పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. వీరినుంచి గంజాయితోపాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం: ట్రాఫిక్ ఎస్ఐ

పెందుర్తి, జూలై 10: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రాణాపాయమని ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో పెందుర్తి జంక్షన్‌లో గురువారం సురక్షిత ప్రయాణంపై వాహనచోదకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గండి బాబ్జీకి సత్కారం

పెందుర్తిరూరల్, జూలై 10: తెలుగుదేశం పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని మొగలిపురంలోని ఆయన నివాసంలో బుధవారం పెందుర్తి మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. బాబ్జీని కలిసిన వారిలో నాయకులు రోమాల శ్రీనివాసరావు, సన్ని, చౌదరి, బూర దేముడు, వడ్డాది నాగప్రసాద్, బుజ్జి, వెంకటరావు, తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించిన సీఎస్ఎంటీ చైర్మన్

మల్కాపురం, జూలై 10: ఈఎస్ఐ ఆస్పత్రిని బుధవారం కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యాధికారులతో వారు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా వాటిని పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా కామత్ సింగ్‌కు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు వినతిపత్రం అందజేశారు. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు కార్మికులు రూ.కోట్లతో డబ్బులు చెల్లిస్తున్నా సేవలు మాత్రం అంతంతమాత్రంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయడానికి, రక్త పరీక్షలకు పరికారాలు లేవని, రోగులకు మందులు ఇవ్వలేకపోతున్నారన్నారు. ఈఎస్ఐ కార్డు హోల్డర్లకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు కల్పించాలని కోరారు.



బలభద్ర, సుభద్ర సమేతంగా జగన్నాథస్వామి

వామన అవతారంలో జగన్నాథస్వామి

అగనంపూడి, జూలై 10: రథోత్సవాల్లో భాగంగా ఇక్కడి జగన్నాథస్వామి బుధవారం వామన అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న మందిరంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితాసహస్రనామ పారాయణాన్ని పఠించగా, సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో వరాహావతారంలో..

పెందుర్తి: సుజాతనగర్‌లోని సువర్చల అభయ మారుతీ పీఠం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి ఇందులో భాగంగా బుధవారం జగన్నాథ స్వామి వరాహావతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పీఠం శ్రీకార్యం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అతిసారపై అవగాహన

కూర్మన్నపాలెం, జూలై 10: అతిసార వ్యాధి బారిన చిన్నారులు పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధిల్లో వడ్లపూడి, కణితిలో బుధవారం అతిసార, మలేరియా, డెంగ్యూ బారిన పడకుండా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు వేడిగా ఉండే ఆహారాన్ని అందించాలన్నారు. అందరూ వ్యక్తిగత శుభ్రతను పాటించడంతో పాటు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కణితి పీహెచ్‌సీ సిబ్బంది ఎస్.బాబీ, శానిటరీ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, జూలై 10: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా ఎల్లపువానిపాలెం, ఎర్రచెరువు, రైల్వే స్టేషన్ ఏరియా, నేతాజీ వీధి, విద్యానగర్, పాత గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, సునర్లకాలనీ, బాజీ జంక్షన్, రెడ్డి వీధి, ఎస్సీ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గోపాలపట్నం, జూలై 10: గ్రేటర్ 89వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీలో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బెహరా మాట్లాడుతూ బాబాసాహెబ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాలనీ యువజన సంఘ సభ్యులు బెహరాను సత్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్

పెదగంట్యాడ, జూలై 10: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కులో బుధవారం బీసీజీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో సుమారు అరవై మందికి పెదగంట్యాడ పీహెచ్‌సీ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, శ్రీరామమూర్తి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 43, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 80, కాకరకాయలు 48, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 32, క్యారెట్ 28, దొండకాయలు 34, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 114, పొటల్స్ 32, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

ఉక్కు పరిరక్షణకు ప్రభుత్వం కృషి

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, జూలై 10: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో టీడీపీ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని గణబాబు ఖండించారు. ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంలో చాలా స్పష్టమైన వైఖరి అవలంబిస్తుందన్నారు. కేవలం వైసీపీకి తొత్తులుగా మారిన పత్రికలు, ఛానళ్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాయని అన్నారు. ఇటువంటి రాతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఎందరో త్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటామని గణబాబు ఉద్ఘాటించారు.

కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్న మోదీ

సీఐటీయూ నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్మికులు

మల్కాపురం, జూలై 10: కార్మిక హక్కులను ప్రధాని నరేంద్ర మోదీ నిర్వీర్యం చేస్తున్నారని సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం కార్మికుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు కనీస వేతనాలను పెంచాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు, తోపుడుబళ్ల వ్యాపారులకు చట్టాలను అమలు చేయాలని పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు, జి.నరేశ్, ప్రతినిధులు బి.శ్రీనివాసరాజు, నీలయ్య, ఏసుబాబు, అర్జునరావు, రామకృష్ణ, దేవి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

మల్కాపురం: గ్రేటర్ 60వ వార్డు అశోక్‌నగర్‌లో తాగునీటి బోరును బుధవారం కార్పొరేటర్ పీవీ సురేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మరిన్ని బోర్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.





కైలాసపురం-మాధవధార రూట్‌లో కొత్త బస్సు సర్వీసు

▸ 48 ఎస్ నంబరుతో సింహాచలం నుంచి ఆర్‌కే బీచ్ వరకు సదుపాయం

మురళీనగర్, జూలై 10; నగరంలో ఆర్టీసీ ప్రయాణికుల ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరింది. ఉత్తర నియోజకవర్గంలో పలుప్రాంతాలను కలుపుతూ సింహాచలం నుంచి ఆర్కే. బీచ్ వరకు కొత్త బస్సు సర్వీసుని వాల్తేరు డిపో ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజరు సుధాకర్ సర్వీసు ప్రారంభించారు.

భలే ఉపయోగం

జాతీయరహదారిపైన కైలాసపురం ఎగువ రహదారిలో దాదాపు రెండు దశాబ్దాలుగా ఒకే బస్సు 48ఏ నంబరుతో నడుస్తోంది. పాత పోస్టాఫీసు నుంచి జగదాంబ, ఆర్టీసీ కాంప్లెక్స్, అక్కయ్యపాలెం దాటి పోర్టు హాస్పిటల్ ఎదుట నుంచి ఇనార్బిట్ రోడ్డులోకి వచ్చి పై రోడ్డు కైలాసపురం, మురళీనగర్, మాధవధార వరకు ఇది నడుస్తోంది. 48ఏ రోజుకి ఎనిమిది ట్రిప్పులు తిరుగుతుంది. మొత్తం 12 కిలోమీటర్ల దూరం గల బస్సులో టికెట్ రూ.25 గరిష్ఠ ధరగా ఉంది. ఆరు బస్సులు తిరుగుతున్నాయి. అయితే, ఇటీవల విస్తరించిన విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రాంతాలకు కొత్త సర్వీసు అవసరమని ఎన్నాళ్ల నుంచో పలువురు కోరుతున్నారు. దీనితో కదలిక వచ్చిన ఆర్టీసీ యాజమాన్యం ఇన్నాళ్లకు మాధవధార రూట్‌లో కొత్త బస్సు వేసింది. ఈ కొత్త బస్సు సర్వీసు సింహాచలం నుంచి ఆర్కే. బీచ్ వరకు నడుపుతున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. సింహాచలం నుంచి బయలు దేరి గోపాలపట్నం, ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి హైవే మీదుగా ఆర్ అండ్‌బీ జంక్షన్ వద్ద మారియట్ హోటల్ నుంచి మాధవధార ఉడాకాలనీ చేరుతుంది. ఇక్కడి నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు కైలాసపురం, పోర్టు హాస్పిటల్ మీదుగా తిరిగి హైవే రోడ్డునుంచి అక్కయ్యపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సు, జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టర్ ఆఫీసు మీదుగా ఆర్కేబీచ్ చేరుతుంది. సింహాచలంలో నుంచి ఆర్కే. బీచ్ వరకు నడిచే ఈ కొత్త 48ఎస్ రూట్ బస్సు ధర రూ. 30లుగా నిర్ణయించారు. కనీస టికెట్ పది రూపాయలు. ప్రస్తుతం రెండు బస్సులు ఉదయం, సాయంత్రం మూడు ట్రిప్పులు చొప్పున నడపనున్నట్టు వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు.



కొత్తగా వేసిన 48 ఎస్ రూట్ ఆర్టీసీ బస్సు

విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి

▸ సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

సీతంపేట, జూలై 10: విద్యార్థి దశ నుంచే దైవభక్తిని, దేశభక్తిని పెంపొందించుకోవాలని సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జాతీయ సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత్ వికాస్ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం, పక్షోత్సవాల ముగింపు ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు భారత్ వికాస పరిషత్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ర జైన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను తాము ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ విశాఖపట్నం ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారిమాణిక్యాలరావు, జాన్సీ, లక్ష్మీభాయి, షర్మిల పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ

అల్లిపురం, జూలై 10: జీవీఎంసీ 33వార్డు పరిధిలోని వెంకటేశ్వరమెట్ట వద్దనున్న గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న శ్రీ వెంకట గౌరీశంకర్ గ్రంథాలయానికి 25 కుర్చీలను దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు 32 వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్ రావు, కందుల నళిని బద్రీనాథ్, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

'రైతు బజారులో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'



సీతమ్మధార రైతుబజార్‌లో వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార, జూలై 10: రైతుబజార్‌లో అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే సహించేదిలేదని అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి హెచ్చరించారు. సీతమ్మధార రైతు బజారులో రైతులు వారికి ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని, దీనిపై బజార్ ఎస్టేట్ అధికారి పట్టించుకోవడం లేదని ఓ కొనుగోలుదారుడు ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌డీవో ఆదేశాలపై తహసీల్దార్ శ్రీరామమూర్తి, హార్టీకల్చర్ కార్యాలయం ప్రతినిధి పి.త్రినాథ్, ఏడీ మార్కెటింగ్ సీనియర్ అసిస్టెంట్ ఎంవీ నాగేశ్వరరావు తదితరులు బుధవారం రైతు బజారును సందర్శించారు. రైతులతోపాటు బజార్‌కి వచ్చినకొనుగోలుదారులతో మాట్లాడారు. ముందుగా రైతుబజార్‌లో స్టాల్స్ ఎన్ని ఉన్నాయో తెలుసుకున్నారు. బినామీలు, దళారులపై ఆరా తీశారు. స్టాల్స్‌లో రైతులు అమ్మకాలు చేస్తున్న కూరగాయలు, వాటి ధరలు బోర్డులో ధరలు పరిశీలించారు. బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబునుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఇబ్రహీం, వీఆర్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైజాగ్ గ్రీన్స్‌పై భీమిలి జట్టు భారీ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 10: వీడీసీఏ వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన ఐదో డివిజన్ తొలి మ్యాచ్‌లో అసోసియేషన్ ఆఫ్ భీమిలి 150 పరుగుల భారీ తేడాతో వైజాగ్ గ్రీన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమిలి 42.1ఓవర్లలో 276 పరుగులు చేసింది. ప్రసాద్ అద్భుతమైన బ్యాటింగ్‌తో సెంచరీ (108) సాధించగా.. నరేష్ 42 పరుగులతో రాణించాడు. లక్ష్య ఛేదనలోవైజాగ్ గ్రీన్స్ 34 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. మరో మ్యాచ్‌లో గ్రాడ్యుయేట్స్ 118 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రాడ్యుయేట్స్ 42.3 ఓవర్లలో 234 పరుగులు చేసింది. యోగి (70), వినయ్‌కుమార్ (69) హాఫ్ సెంచరీలు చేశారు.జింక్ గ్రౌండ్‌లోజరిగిన ఆరో డివిజన్ మ్యాచ్‌లో ఆశ్రయ సీసీ ఏడు వికెట్ల తేడాతో మాక్స్‌వెల్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మ్యాక్స్‌వెల్ 43 ఓవర్లలో ఏడు వికెట్లకు 251 పరుగులు చేసింది. జట్టులో శ్యామ్‌కుమార్ (83), అన్వేష్ (61) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆశ్రయ సీసీ 31.4 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 252 పరుగులుచేసివిజయం సాధించింది.జట్టులోమణికంఠ సెంచరీతో (114)రాణించి జట్టుకు విజయాన్నందించాడు.

కేజీహెచ్‌కు గంగవరం పోర్టు ఆర్థిక సాయం



కలెక్టర్‌కు రూ. 90లక్షల చెక్కును ఇస్తున్న పోర్టు యాజమాన్యప్రతినిధి

విశాఖపట్నం, జూలై 10: కేజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అదానీ గంగవరం పోర్టు రూ.90 లక్షలు ఆర్థిక సాయం అందించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చెక్కును గంగవరం పోర్టు ప్రతినిధి బుధవారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు. పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్‌యూనిట్‌లో మెరుగైన సదుపాయాల కల్పనకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. స్థానిక పిల్లలకు, కుటుంబాలకు సాధ్యమైన మేర ఉత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా అదానీ ఫౌండేషన్, గంగవరం పోర్టు పనిచేస్తున్నాయన్నారు. పేదలకు మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, ఆరోగ్య సంరక్షణ కల్పించడమే లక్ష్యమన్నారు.

బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన శ్రీను



విజేత శ్రీనును సత్కరిస్తున్న సభ్యులు

అక్కయ్యపాలెం, జూలై 10: ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జీజీకే బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన కలిశెట్టి శ్రీను ర్యాంకర్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో స్టేట్ పో బాక్సింగ్ కౌన్సిల్ క్లబ్ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. శ్రీను సూపర్ బాం టమ్ కేటగిరిలో పాల్గొని ప్రత్యర్థి తెలంగాణ బాక్సర్ వివేక్‌ను నిమిషం 38 సెకన్లలో నాకౌట్ చేసి విజయం సాధించారు. 20వ ర్యాంకర్‌గా నిలిచిన శ్రీనును స్టేట్ పో బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు యల్లపు రఘురాం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 22న జరిగే ప్రపంచ బాక్సింగ్ పోటీలకు శ్రీను ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సర్లు అమ్మోరు, పృథ్వీ, ఐబీసీ రిఫరీలు రామారావు, రూబెన్, విశాఖ పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, కృష్ణారెడ్డి, సునీల్, సతీష్, గోపాల్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎంపీలు

సీతమ్మధార, జూలై 10: ఆర్ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఆర్ఎంపీల అసోసియేషన్ డిమాండ్ చేసింది. నగరంలోని డైమండ్ పార్కు వద్ద ఓ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఆర్ఎంపీల సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతో మంది ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గ్రామీణ వైద్యులకు మేలు చేకూరేలా 429 జీవో 2008లో ఇచ్చారని, అయితే, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలో గ్రామీణ వైద్యులు సుమారు 9 వేల మంది ఉన్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకుని ఈ జీవోను పునరుద్ధరించాలని కోరారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ కార్యదర్శి ఎస్.సుగణేశ్వరి, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ సంఘం సలహాదారులు కోన ప్రకాష్, సమన్వయకర్త కళ్యాణి, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లోగిశ గణేష్, పచ్చిపులుసు కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్కులో వసతుల పరిశీలన



పార్కులో పర్యటిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ రవీంద్ర

డాబాగార్డెన్స్, జూలై 10: గ్రేటర్ 31వ వార్డుసెంట్రల్ పార్కులో వీఎంఆర్డీఏ కమిషనర్ రవీంద్ర బుధవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. మరమ్మతుకు గురైన చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, సైన్‌బోర్డులను బాగు చేయించాలని, నడక దారిలో పాడైన టైల్స్‌ను మార్చాలని కోరారు. ఈపర్యటనలో సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ బేగం పాల్గొన్నారు.

అస్తవ్యస్త విశాఖ!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. భీమిలి సమీపంలో సుమారు 50 ఎకరాలను యజమానుల నుంచి వైసీపీ కీలక నేతలు బలవంతంగా తక్కువ ధరకు లాగేసుకున్నారు. అలాగే రేడియంట్, ఎన్‌సీసీ ప్రాజెక్టులు సొంతం చేసుకున్నారు. రుషికొండపై పర్యాటక కాటేజీలు కూల్చివేసి, ప్రజాధనంతో అత్యంత విలాసవంతమైన భవనం నిర్మించేసుకున్నారు. రూరల్ ప్రాంతంలో డీఫారం భూములను కాజేయడానికి వీలుగా జీవో 596 తీసుకువచ్చి, కోట్ల విలువైన భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు సాధించారు. ఇలా గడచిన ఐదేళ్లలో రమారమి 50 వేల కోట్ల విలువైన భూములు, ప్రాజెక్టులను వైసీపీ నేతలు, పెద్దలు చేజిక్కించుకున్నారనేది బహిరంగ రహస్యం.

ప్రాభవం కోల్పోయిన నగరం

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా విశాఖకు పలు ఐటీ కంపెనీలు వచ్చాయి. ఇందుకోసం ఐటీ టవర్లు నిర్మించారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అదానీ వంటి పెద్ద సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఐటీ కార్యకలాపాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ కంపెనీ తరలిపోయింది. నాలుగేళ్ల తరువాత అదానీ తిరిగి వచ్చి, శంకుస్థాపన చేసినా ఇంతవరకూ పనులు ప్రారంభించలేదు. పలు ఐటీ కంపెనీలు విశాఖ నుంచి వెళ్లిపోయాయి. కొత్తవి రావడానికి బెదిరిపోయాయి. పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. కొత్తగా ఒక్క ప్రాజెక్టు రాలేదు. అలాగే చంద్రబాబునాయుడు హయాంలో ఆర్కే బీచ్‌రోడ్డు సమీపాన గల ఏపీఐఐసీ భూమిలో భారీ మాల్ నిర్మాణానికి 'లులూ' సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తగిన సహకారం అందించకపోవడంతో లులూ విశాఖకు బైబై చెప్పేసింది.

ఏయూకు వైసీపీ చీడ

నగరంలో పేరొందిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వైసీపీ కార్యాలయంగా మారిపోయింది. ఇక్కడ జరిగినన్ని అక్రమాలు రాష్ట్రంలో మరే విశ్వవిద్యాలయంలోనూ జరగలేదనేది వాస్తవం. అదేవిధంగా పారిశ్రామికంగా విస్తరించే క్రమంలో మెట్రో రైలు ప్రాజెక్టు ఐదేళ్లలో అతీగతీ లేదు. గత పాలకులు కావాలనే మెట్రో ప్రాజెక్టును మూలనపడేశారనే వాదన ఉంది. విశాఖలో గంజాయి సంస్కృతి దారుణంగా పెరిగిపోయింది. రౌడీమూకలు చెలరేగిపోయారు. ఏడాది క్రితం ఎంపీ కుటుంబ సభ్యుల్నే కిడ్నాప్ చేయడం దేశంలోనే కలకలం రేపింది.

బాబు భరోసాతోనే భవిత

విభజిత రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా నగరానికి వస్తున్న చంద్రబాబునాయుడుపైనే విశాఖ ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి కొత్త కంపెనీలు, ప్రాజెక్టులను తీసుకురావాల్సి ఉంది. ఇందుకోసం పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు, ఐటీ నిపుణుల్లో భరోసా కల్పించాలి. పెండింగ్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాల్సిన బాధ్యత బాబుపైనే ఉంది. గురువారం సాయంత్రం పలు శాఖలకు చెందిన ప్రాజెక్టులు, పెండింగ్ పనులపై విమానాశ్రయంలో అధికారులతో చంద్రబాబు సమీక్షించనున్నారు. ఇందులో భాగంగా విశాఖకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకుంటారని నగరవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ లెక్కింపు

అల్లిపురం, జూలై 10: అచ్చియ్యమ్మపేట గ్రామ దేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయశాఖ అధికారి బి.వంసత కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. శ్రీహరిసేవా సంఘం సహకారంతో ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో మే 22నుంచి జూలై 10 వరకు మొత్తంరూ.21, 03,182 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబా తెలిపారు.

స్టేషన్ల నుంచి వాహనాల తరలింపు

సీతంపేట, జూలై 10: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలో పలు కేసులు పట్టుబడిన, దొంగతనం కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను మధురవాడలో యార్డ్‌కి తరలించారు. స్టేషన్‌లో వాహనాలు మూలకు చేరడంతోపాటు తుప్పుపట్టి పోతుండడంతో వాటిని యార్డ్‌కి తరలించారు.

50,66,616

... 5వ పేజీ తరువాయి

పెరిగారు. మూడు జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా చూస్తే గడిచిన ఏడాది 50,03,284 మంది జనాభా ఉండగా,ఈ ఏడాదిలో50,66,616కు (63,332 మంది పెరిగారు) చేరారు. ఏయూలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌లోరీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్‌గా డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ వై.రమణ, రీసెర్చ్ ఫెలోస్ డాక్టర్ సీహెచ్‌పాదాలు, శ్రీనివాస్ పని చేశారు.

వేగంగా అర్బనైజేషన్

-ప్రొఫెసర్ బి.మునిస్వామి, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్

ఏటా జనాభా భారీగా పెరుగుతోంది. 2011 లెక్కలను ప్రామాణికంగా తీసుకుని ఏటా జనాభా పెరుగుదలను అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా దేశంలో అర్బనైజేషన్ వేగంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పనపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రస్తుతం దేశంలో 36.3 శాతం అర్బన్ పాపులేషన్ ఉంది. రానున్న పదేళ్లలోభారీగా పెరగవచ్చు.రోడ్లు, ఇళ్లు, తాగు నీరు, వైద్యంవంటి సదుపాయాలను పెంచాల్సి ఉంది.లేకపోతే అనేకరకాల ఇబ్బందులు తలెత్తవచ్చు.

ఉక్కుపై వివక్ష

... 5వ పేజీ తరువాయి

చార్జీలు ఎంత వసూలు చేస్తున్నారు?, వాటిని ఎంత పెంచాలి?, ఇతర ఆస్తులను లీజుకు ఇస్తే ఎంత ఆదాయం సమకూరుతుంది?...తదితర అంశాలపైనే ఉక్కు మంత్రిత్వ శాఖ సమీక్షలు నిర్వహిస్తోంది. కార్మికులు, ఉద్యోగులు ఆలస్యంగా వస్తే ఎంతమందికి షోకాజ్‌లు ఇచ్చారు?...ఇలాంటిఅంశాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది.

విశాఖ స్టీల్‌ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 74 లక్షల టన్నులు. సుమారు రూ.25 వేల కోట్లు వెచ్చించి విస్తరణ ద్వారా యంత్ర సామగ్రిని, ఇతర వసతులు సమకూర్చుకుంది. గత రెండేళ్లలో ఒక్కరోజు కూడా వీటిని పూర్తిస్థాయిలో వినియోగించలేదు. అవన్నీ వృథాగా ఉన్నాయి, సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేస్తే వ్యయం తగ్గుతుంది. అంతకంటే తక్కువ చేస్తే ఆ వ్యయం పెరుగుతుంది. లాభాలు తగ్గిపోతాయి. నష్టాలు పెరుగుతాయి. ప్రస్తుతం విశాఖ ప్లాంటు ఆ కారణం వల్లనే నష్టాల్లో కూరుకుపోయింది. మూడు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఒకటి పూర్తిగా మూసేశారు.

రూ.2,300 కోట్లు పప్పుబెల్లాల్లా ఖర్చు చేసేశారు

మూడో బ్లాస్ట్ ఫర్నేసును వినియోగంలోకి తెస్తామని ప్రకటించి జిందాల్ నుంచి రూ.800 కోట్ల రుణానికి ఒప్పందం చేసుకున్నారు. ఆ సంస్థ రూ.100 కోట్లు, రూ.200 కోట్లు చొప్పున గత ఏడాది కాలంలో రూ.1,500 కోట్లు వచ్చాయి. మరోవైపు టాటా స్టీల్ కూడా రూ.800 కోట్లు రుణం ఇచ్చింది. ఇవన్నీ ఒకేసారి అంది ఉంటే ఆ రూ.2,300 కోట్లతో మూడో బ్లాస్ట్ ఫర్నేసును విజయవంతంగా వినియోగంలోకి తీసుకువచ్చేవారు. కానీ అలాకాకుండా వంద, రెండు వందల కోట్లు చొప్పున వారి నుంచి తీసుకోవడం వల్ల ఆ నిధులన్నీ చిల్లర ఖర్చులకు అయిపోయాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేసు అలాగే మూతపడి ఉంది. ఈప్లాంటును పూర్తిస్థాయిలో పనిచేయించడానికి ఇప్పటివరకూ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఎటువంటి సాయం చేయలేదు.

ఇప్పుడు ఐరన్‌ఓర్ ఇవ్వబోమని హెచ్చరికలు

ఛత్తీస్‌గడ్‌లోని బైలదిల్లాలో భారీఎత్తున ఐరన్‌ఓర్ గనులు ఉన్నాయనే కారణంతోనే నాడు విశాఖలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్యానికి ముందే కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్ ఉంది. ఆ మార్గంలో ఐరన్‌ఓర్ తెచ్చుకొని విశాఖలో స్టీల్ ఉత్పత్తి చేయవచ్చునని ఇక్కడ ప్లాంటు పెట్టారు. ఇంకో 200 ఏళ్లు తవ్వినా అక్కడి గనులు తరిగిపోవు. దానిని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఎండీసీ నిర్వహిస్తోంది. వారి నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఐరన్‌ఓర్ తెచ్చుకుంటోంది. ఇప్పుడు ఆ ఐరన్‌ఓర్‌పై ఆశలు పెట్టుకోవద్దంటూ కేంద్ర ఉక్కు శాఖ జాయింట్ సెక్రటరీ, విశాఖ ఉక్కు ప్రభుత్వ డైరెక్టర్ అయిన సంజయ్ రాయ్ గత మూడు నెలలుగా విశాఖ ఉక్కు అధికారులను హెచ్చరిస్తున్నారు. ఎన్ఎండీసీ ఇకపై ఓర్ సరఫరా చేయదని, కర్ణాటక నుంచి తెప్పించుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ఆ విధంగా చేస్తే టన్నుకు రూ.2 వేలు ఖర్చు అవుతుంది. అంతేకాకుండా కర్ణాటక నుంచి ఐరన్‌ఓర్ తెచ్చుకోవాలంటే...అక్కడి ప్రభుత్వానికి ప్రత్యేకమైన సెస్‌లు చెల్లించి, పర్యావరణ అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఇందుకోసం ఒక ఉన్నతాధికారిని నియమించుకోవలసి ఉంటుంది. ఇవన్నీ కాకుండా రవాణా వ్యయం మరింత పెరుగుతుంది.

ఆస్తులు అమ్మినా రూపాయి ఇవ్వడం లేదు

నిరర్థక ఆస్తుల పేరుతో ఎక్కడెక్కడో ఉన్న ఆస్తులు అమ్మేస్తున్నారు. వాటి ద్వారా వచ్చిన దాంట్లో రూపాయి కూడా ప్లాంటుకు ఇవ్వడం లేదు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటును రైల్వేకు రూ.2 వేల కోట్లకు విక్రయించారు. దానిపై ఉన్న రూ.1,200 కోట్ల రుణాలు పోను మిగిలిన రూ.800 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మొత్తం బ్యాంకులో వేయగానే...వివిధ బ్యాంకుల ద్వారా ఆ మొత్తాన్ని కూడా బ్లాక్ చేయించేశారు. తమ వద్ద విశాఖపట్నం స్టీల్ ప్లాంటు రుణాలు తీసుకుందని, వాటికి జమ చేసుకుంటామని చెప్పి వాటిని తీసేసుకున్నాయి. విశాఖపట్నంలో భూముల విక్రయం ద్వారా రూ.450 కోట్లు వరకు సమకూరాయి. అవీ ఇవ్వలేదు. ఇప్పుడు హైదరాబాద్, చెన్నైలలో స్టాక్‌యార్డులను విక్రయానికి పెట్టారు. వాటి ద్వారా మరో రూ.450 కోట్లు సమకూరతాయి. ఇవన్నీ వివాదాల్లో ఉన్నాయని పక్కన పెడుతున్నారు. ముడిపదార్థాల కొనుగోలుకు నిధులు లేక, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయలేక ప్లాంటు యాజమాన్యం నానా పాట్లు పడుతోంది. నిలదిక్కుకోవడానికి కేంద్రం తరఫున ఎటువంటి సాయం అందడం లేదు. కర్ణాటకలో మూతపడిన స్టీల్‌ప్లాంటును తెరిపిస్తామని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి చెబుతున్నారు గానీ విశాఖ ఉక్కును గట్టెక్కిస్తామని మాత్రం చెప్పడం లేదు. ఏపీ ప్రభుత్వం నుంచి గట్టి ఒత్తిడి తేనంతవరకు ఇదే దుస్థితి కొనసాగుతుంది.

కాగా, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం విశాఖపట్నం వచ్చారు. గురువారం స్టీల్‌ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎటువంటి ప్రకటన చేస్తారోననే అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

స్టీల్‌ప్లాంటుకు అండగా ఉంటాం

... 5వ పేజీ తరువాయి

ఆర్థిక సహాయం, ప్రోత్సాహం, భవిష్యత్తులో మరింత ప్రగతి కోసం చేపట్టాల్సిన చర్యలు, ఉద్యోగుల ప్రధాన సమస్యలు వంటి అంశాలపై చర్చించారు.

ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తాం

ఐదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ఏమీ చేయలేదని, ఇప్పుడు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపే విధంగా వ్యవహరిస్తున్నదని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఆయన స్టీల్‌ప్లాంట్ మల్టీపర్పస్ హాల్‌లో బుధవారం కార్మిక సంఘ నాయకులతో మాట్లాడారు. ఏ ఆధారం లేకుండా కొన్ని ఆంగ్ల పత్రికల్లో స్టీల్‌ప్లాంటు అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా చూడడంతోపాటు ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఉద్యోగులకు, నిర్వాసితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషిచేస్తామన్నారు. ప్లాంటులో ప్రస్తుతం సగం ఉత్పత్తి మాత్రమే జరుగుతుందని, పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగే విధంగా కేంద్రం నుంచి సహకారం తీసుకుంటామన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రం తరఫున ప్లాంట్‌కు అన్నివిధాలా మద్దతు ఉంటుందన్నారు. ఏం కావాలన్నా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అన్ని నిర్మాణాలు ఒక్కరికే

ఇక్కడ వివిధ సంస్థలకు భూమి కేటాయిస్తారు. వారు నిర్మాణాలు చేసుకోవడానికి టెండర్లు ఆహ్వానిస్తారు. కానీ వాటిని పక్కకునెట్టి ఒకరికే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తారు. అందులో మతలబు ఏమిటనేది అర్థం కాదు. జోన్ ప్రారంభించినప్పుడు ఒక సంస్థ నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. వారి దగ్గర పనిచేసే ముఖ్యమైన వ్యక్తిని తీసుకొని, ఇప్పుడు ఆయనకే అన్ని కాంట్రాక్టులు ఇప్పిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ ఆర్థిక వ్యవహారాలు సరిగ్గా లేవు. ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నామని నిర్మాణాలు చేపడుతుంటారు. కానీ వాటి ఫలితం ఎక్కడా కనపడదు. సమావేశాలు నిర్వహించడం, పెద్దగా అరవడం, ఎవరైనా ఏదైనా ప్రశ్నిస్తే వారిని బయటకు పంపేయడం...ఇదే తరహాలో వ్యవహారాలు సాగుతున్నాయి. ఇక్కడ ఏర్పాటయ్యే కంపెనీలు భూమిని లీజుకు తీసుకుంటాయి. డబ్బులు చెల్లిస్తాయి. అవన్నీ ఎక్కడికి వెళుతున్నాయనే దానికి సరైన లెక్కలు లేవు. పరిశ్రమలు పెట్టేవారికి ఇబ్బందులు ఉండకూడదని సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తుంటే...వాటిని ఇక్కడ దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులెవరినీ రానివ్వకపోవడం, పరిశ్రమల శాఖ అధికారులకూ సరైన సమాచారమివ్వక పోవడం వంటి లోపాలు ఉన్నాయి. గురువారం వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ జోన్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి ప్రక్షాళన చేయకపోతే ఆశించిన ప్రయోజనం చేకూరదు. కరోనాలోమాస్కులు తయారు చేశామనో, ఆక్సిజన్ అందించామనే కబుర్లు కాకుండా వైద్య రంగానికి ఉపయోగపడే పరికరాలుఏమి తయారుచేశారో,ఎంత ఉత్పత్తి జరిగిందో, ఎన్ని పెట్టుబడులు వచ్చాయో, ఎంతమందికిఉపాధి కల్పించాలో అక్కడిఅధికారులు చెప్పాల్సిన అవసరం ఉంది.

ఆ 16 ఫైళ్లను వెనక్కి పంపించండి

... 5వ పేజీ తరువాయి

విల్లాల నిర్మాణానికి జీవీఎంసీ కమిషనర్ సహకరించారంటూ జనసేన, టీడీపీ నేతలు ఆరోపించారు. ఆ ఫైలును తిరస్కరించకుండా తన వద్ద పెండింగ్‌లో పెట్టుకోవడం ద్వారా డీమ్డ్ అప్రూవ్ అయ్యేందుకు తోడ్పడ్డారని విమర్శించారు. అలాగే పాపయ్యరాజుపాలెం వద్ద సర్వే నంబర్ 114/2లోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ దరఖాస్తుపై ఏసీపీ స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా ...తిరస్కరిస్తారని ఉద్దేశంతో ఆ ఫైలును తనకు పంపాలని కింది స్థాయి అధికారులను ఆదేశించి తన లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచేశారన్నారు. దీని వల్ల ఆ ప్లాన్ డీమ్డ్ టు బి అప్రూవ్ అయిపోయింది. అలాగే మద్రిపాలెంలో 'కరన్ ఉద్యోగ్ డెవలపర్స్' సంస్థ నాలుగు ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టుకు కూడా ప్లాన్ డీమ్డ్‌అప్రూవల్ అయిపోయింది. ఇంకా పరవాడలో ప్రకృతి అవెన్యూ, అనకాపల్లి సమీపంలోని కొప్పాక వద్ద సర్వేనంబర్ 17/పీలో, మల్కాపురంలోని సర్వేనంబర్ 42/పీ, 42/1పీలో 20,292 చదరపు మీటర్లలో నిర్మిస్తున్న ప్రాజెక్టు, ధారపాలెంలోని సర్వేనంబర్ 3/1లో 1003 చదరపు మీటర్లలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో బోలెడు లొసుగులున్నా వాటి ప్లాన్‌లన్నీ అప్రూవ్ అయిపోయాయి. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో డీమ్డ్ అప్రూవ్ అయిపోయిన 16 ప్రాజెక్టులకు సంబంధించిన ప్లాన్‌లను వెనక్కి పంపించాలంటూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయానికి ఈనెల 8న కమిషనర్ లేఖ రాశారు. గత మార్చి 13 నుంచి ఎన్నికల కోడ్ రావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులంతా బిజీ అయిపోయారని, అందువల్లే అవన్నీ డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని లేఖలో పొందుపరిచారు. ఆయా ఫైళ్లను పరిశీలించాల్సి ఉన్నందున వెనక్కి పంపాలంటూ ఆర్‌టీఎస్ పెట్టారు.



కూర్మావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం,జూలై 10 : పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు కూర్మావతారంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం మందిరంలో కూర్మావతార విశిష్టతపై పండితులు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందికి జరిమానా

భీమునిపట్నం, జూలై 10 : పట్టణ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో పట్టుబడిన 12 మందికి ఒక్కొక్కరికి రూ. పది వేలు చొప్పున జరిమానా విధిస్తూ పట్టణ 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. సౌజన్య తీర్పు చెప్పారు. ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలు ప్రకారం.. ట్రాఫిక్ పీఎస్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో 12 మంది పట్టుబడ్డారని చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి, ఒక్కొక్కరికి రూ. పది వేలు చొప్పున మొత్తం రూ.1 లక్షా 20 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 10 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కాగా స్వామివారికి ఆర్జిత సేవల్లో భాగంగా గరుడసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామార్చన జరిపారు. మంగళ వాయిద్యాల వెంట భక్తులు గరుడ వాహనంపై ఉన్న స్వామివారి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు.

అనాథ యువతి మృతదేహానికి అంత్యక్రియలు

భీమునిపట్నం, జూలై 10 : పట్టణంలోని నేరేళ్లవలస కాలనీలో ఉన్న అసంపూర్తి భవనంలో ఉన్న అనాథ యువతి మాదాబత్తుల విజయలక్ష్మి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. కొంతకాలంగా ఆమె ఆరోగ్యం బాగా లేకపోవడంతో కాలనీకి చెందిన గొరపల్లి సన్యాసిరావు ఓఎస్‌జీ ఫౌండేషన్, ఏఎస్ఆర్ఆర్ సభ్యుల సహకారంతో కేజీహెచ్‌లో చేర్పించారు. ఆమెకు మతిస్థిమితం లేదని, మానసిక వైద్య శాలకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. కానీ యువతి మానసిక వైద్య శాలలో చేరడానికి అంగీకరించకపోవడంతో తిరిగి కాలనీకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాలు విడిచింది. మృతదేహానికి యువకులు గొరపల్లి సన్యాసిరావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు గుండాసు అరవింద్, నేరాళ్ల తేజ, దళాయి శివ, తదితరులు అంత్యక్రియలు నిర్వహించారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

ఆరిలోవ, జూలై 10 : విమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలు జీతాలు చెల్లించకపోవడంతో బుధవారం వారు ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల జీతాలతో పాటు నెలకు కనీసం రూ. 26 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 43, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 80, కాకరకాయలు 48, బీరకాయలు 36, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 32, క్యారెట్ 28, దొండకాయలు 34, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6,మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది) 140, బరబటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 114, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 97
ఫారం ధర	-- 117
విత్ స్కిన్	-- 204
స్కిన్‌లెస్	-- 214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

భీమిలిలో సబ్ కోర్టు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఘనంగా సత్కరించిన బార్ అసోసియేషన్

భీమునిపట్నం, జూలై 10 : పట్టణంలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి భీమిలి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో సీనియరు న్యాయవాదులు ఎంఎస్ గౌతమ్, పి. సుందర్‌సింగ్, వెంకటేశ్వరరావు, ఏజీపీ పాత్రుడు, తదితరులు పట్టణంలో గంటాను ఆయన నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమిలికి సబ్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత వుందని ఎమ్మెల్యేకు వివరించారు. సబ్‌కోర్టు ఏర్పాటుకు గతంలో హైకోర్టు అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం ఆ ఫైల్ సీఎంవో కార్యాలయంలో పెండింగ్‌లో వుందని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని తెలిపారు. తొలుత వారు ఎమ్మెల్యేను దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పప్పు భరద్వాజ్, ముమ్మిడిశెట్టి సునీల్, బోని శివ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



గంటాను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్ వినతి

తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గంలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే శ్రీనివాసరావును కోరారు. వారు భీమిలిలో గంటాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత మేరకు ప్రభుత్వ శాఖల్లో ఇంజనీరింగ్ జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. అలాగే ప్రమోషన్లు, పే స్కేల్ సవరణ తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, గంటా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

తోటగరువు హైస్కూల్ అప్‌గ్రేడ్‌కు చర్యలు

- వచ్చే విద్యా సంవత్సరం నాటికి జూనియర్ కళాశాల ఏర్పాటు
- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జూలై 10 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకుదీటుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పాఠశాలలో ఈఏడాది విద్యార్థుల చేరికలు బాగా తగ్గాయని హెచ్‌ఎం దుర్గాభవానీ చెప్పారని,అందుకు అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. కొంతమంది సంఘ విద్రోహ శక్తులు విద్యార్థులను భయపెడుతున్నాయని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించడం లేదని తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. దీనిపై పోలీసులను నిఘా వేయాలని కోరినట్టు తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానికులు బాలికలకు ప్రత్యేక కళాశాల, పాఠశాల ఏర్పాటు చేయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, ఎంఈఓ రవీంద్రబాబు, ఎస్సీ సెల్ నాయకులు బుడుమూరు గోవింద్, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, బీజేపీ జిల్లా మెడికల్ కన్వీనర్ కేవీ వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

భీమునిపట్నం/భీమునిపట్నం రూరల్ : విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆమె స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే రాయిపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా ఆమె యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియరు నాయకులు గాడు అప్పలనాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి చోడిపల్లి సాయి జై శంకర్, నాయకులు పిట్టా వెంకటరావు చెట్ల రమణ, పి.రవి, కోండ్రుకృష్ణ, సరగడ గోపిరెడ్డి, ఊళ్ల దుర్గారావు, జోగ సన్యాసిరావు, బెల్లాన ఆదిరెడ్డి,జనసేన వార్డు అధ్యక్షుడు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'

సింహాచలం, జూలై 10 : ప్రతిఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం పిలుపునిచ్చారు. 98వ వార్డు సింహపురి కాలనీలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెద్దసంఖ్యలో నాటి వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న జీవరాశులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు విశ్రాంత ఇంజినీరు జనార్దన్, వాకర్స్ శ్రీనివాసరావు, గోపాల్, రమేష్ రెడ్డి, హరిదాసు, ప్రకాష్ పాల్గొన్నారు.

'కార్మికుల హక్కులను పరిరక్షించాలి'



జోనల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మధురవాడ, జూలై 10 : ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మధురవాడ జోన్ సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కార్మికుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మధురవాడలోని వార్డు సచివాలయం వద్ద సీటూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు రామప్పుడు, శేషుబాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, రాంబాబు, గోవిందు, నరసయ్యమ్మ పాల్గొన్నారు.

కొమ్మాది : కార్మికుల హక్కుల రక్షణకు నిరంతరం పోరాటం చేయాలని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం కార్మికుల హక్కుల దినోత్సవం సందర్భంగా జోన్-2 కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు డి. కొండమ్మ, పి.రాజ్‌కుమార్, అంగన్వాడి యూనియన్ నాయకులు శ్రీదేవి, విజయ, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరులో అక్రమాలపై ఫిర్యాదు

ఆనందపురం, జూలై 10 : వేములవలసలో ఇళ్ల మంజూరులో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరపాలని కోరుతూ తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు అదే పంచాయతీకి చెందిన కోరాడ దామోదర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయన్నారు. ముఖ్యంగా సర్వే నెంబరు 152/1లో వంద ప్లాట్లతో వేసిన లే-అవుట్‌లో చాలామంది అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, ప్రభుత్వ ఉద్యోగులకు, స్థానిక నాయకులు బినామీ పేర్లు మీదు, చనిపోయిన వారి పేర్లు మీద ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

వెంకోజీపాలెం, జూలై 10 : ఏయూకు తక్షణమే వీసీని నియమించి పాలన గాడిలో పెట్టాలని ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సరేష్ మీనన్ కోరారు. బుధవారం వారు ఏయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి, కృష్ణా వర్సిటీ నుంచి వచ్చిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇక్కడ జర్నలిజం డిపార్ట్‌మెంట్‌లో రూల్స్‌కి విరుద్ధంగా నియమించడాన్ని తప్పుపట్టారు.





మంత్రి లోకేశ్‌తో ఏఐటీయూసీ నాయకులు

లోకేశ్ దృష్టికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు

వెంకోజీపాలెం, జూలై 10 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ నాయకత్వంలో ఆ బృందం మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. బుధవారం వారు ఉండవల్లిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వచ్చిన నిధులను నవరత్నాలు పథకాలకు మళ్లించి, కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైయిమ్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు.దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్. వెంకట సుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పి. సత్యన్నారాయణ, రాష్ట్ర నాయకులు కోట సత్తిబాబు, అనపాన షణ్ముఖరావు, సోనరాజు, ఎస్. శ్రీరాములు, నీలకంఠ శివప్రసాద్, ఉప్పాడ సూర్యనారాయణ, సూరంశెట్టి రామారావు, మెనుగు రామారావు పాల్గొన్నారు.

'ఏయూకి ఇన్‌చార్జి వీసీని నియమించాలి'

వెంకోజీపాలెం, జూలై 10 : ఏయూకు తక్షణమే ఇన్‌చార్జి వీసీని నియమించాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొయ్యే ఆనంద్ రత్నకుమార్ కోరారు. ఈమేరకు బుధవారం వారు ఉండవల్లి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీసీ లేకపోవడం వల్ల ఉన్నతాధికారులు ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే నియమిస్తామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు తొలగింపు

పద్మనాభం, జూలై 10 : మండలంలోని కృష్ణాపురంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని సర్వే నెంబరు 82-2లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని గత ఏడాది అమ్మకానికి పెట్టిన వ్యవహారం బయట పడడంతో భీమిలి ఆర్డీఓ భాస్కరరెడ్డి, అప్పటి తహసీల్దారు వేణుగోపాల్ అమ్మకానికి పెట్టిన భూమిని స్వాధీనం చేసుకొని బోర్డు పాతారు. కొన్ని రోజుల తరువాత బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విషయం స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోకుండా వదిలేసారన్న విమర్శలు వచ్చాయి. సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ స్థాయి అధికారి అయిన ఆర్డీఓ స్వయంగా పాతిన బోర్డునే తొలగిస్తే స్థానిక గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని పరులకు దోచిపెట్టడం వెనుక వారి సహకారం కూడా ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ, టీడీపీ నాయకులు ఈ భూ దోపిడీ వ్యవహారంలో ఉన్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వచ్చిన ఫిర్యాదుల మేరకు వాస్తవ పరిస్థితిని విలేఖర్లు బుధవారం పరిశీలించారు. కాగా ఈ విషయమై తహసీల్దారు ఎన్. వెంకటరావును వివరణ కోరగా ఆయన సంబంధిత భూమిని ఎఫ్ఎంబీ మ్యాపుల ద్వారా పరిశీలించారు. ఇనాం అన్‌షెటిల్ గ్రామమైన ఇక్కడ సర్వే నెంబరు 82-2లోని 8.50 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనన్నారు. భూమిని అన్యాక్రాంతం కానివ్వమన్నారు. వెంటనే బోర్డు ఏర్పాటు చేయాలని ఆర్ఐ కోటి, వీఆర్వో రవిని ఆదేశించారు. బోర్డును తొలగించిన వ్యక్తుల గురించి ఆరా తీసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్

సింహాచలం, జూలై 10 : ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవ చ్చునని సింహాచలంలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యాధికారి డా. ఎం. అరుణ్ ప్రకాష్ అన్నారు. బుధవారం సింహాచలం దేవస్థానం సంస్కృత ఉన్నత పాఠశాలలో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి కాంపౌండర్ పద్మావతి, దేవస్థానం హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాభవానీ, ఆసుపత్రి ఎంఎన్‌ఓ వినోద్‌కుమార్, యోగా శిక్షకులు భాలభాను, విజయదుర్గా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు హోమియో మందు వేస్తున్న వైద్య సిబ్బంది



ఇసుకతోటలో టీడీపీ నాయకుల ర్యాలీ

16వ వార్డులో టీడీపీ నాయకుల ర్యాలీ

వెంకోజీపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో అతిసారాపై అవగాహన కల్పిస్తూ టీడీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉంచకూడదని, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముగడ వాసు, వార్డు అధ్యక్షుడు నారు గోపి, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, పల్లా బాబు, మొల్లి శోభ, జీవీఎంసీ సీవో భవాని, ఆర్పీలు వెంకటలక్ష్మి, పార్వతి, ఏఎన్‌ఎం సుజాత, ఆశా వర్కర్ లక్ష్మీకుమారి, ఎన్జీవో వాసవ్య మహిళా మండలి కమ్యూనిటీ కోఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.

కొమ్మాది : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుజనా సూచించారు. పీఎంపాలెం కాలనీలో వైద్య సిబ్బంది అతిసారాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీరు తాగాలని, బయట తినుబండారాలను తినకూడదని చెప్పారు.కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు లోడగల జానకీ రామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులు బుధవారం అతిసార నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ రాజ్, రామారావు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న శివాజీ, తదితరులు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

మధురవాడ, జూలై 10 : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించడం వల్ల భవన నిర్మాణ రంగం పురోగతి సాధిస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ అన్నారు. బుధవారం ఏడో వార్డు కృష్ణానగర్‌లో భవన నిర్మాణ రంగ కార్మికుల సమక్షంలో శివాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక కొరత, అధిక ధరల వల్ల వేలాది గృహ నిర్మాణాలు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టడంతో భవన నిర్మాణ రంగం మళ్లీ పుంజుకుని, కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, కాశీ, మురళీ, ఎస్. లక్ష్మీ, లీలా, సంతోషి పాల్గొన్నారు.

పద్మనాభం (రూరల్) : ఉచిత ఇసుక వల్ల భవన నిర్మాణ రంగం అభివృద్ధి చెంది, కార్మికులకు ఉపాధి లభిస్తుందని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్‌కుమార్ దంపతులు అన్నారు. బుధవారం వారు మద్ది గ్రామంలో చంద్రబాబు చిత్రపటానికి భవన నిర్మాణ కార్మికులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత ప్రకాష్, కనకల సన్యాసినాయుడు, కనకల గణేష్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

16న ఎండాడలో దుర్గాలమ్మ పండగ



ఎంపీ శ్రీభరత్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

ఎండాడ, జూలై 10 : ఎండాడ ప్రజల ఆరాధ్య దేవత దుర్గాలమ్మ పండుగ ఈనెల 16న జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వారు ఎంపీ శ్రీభరత్‌తో పాటు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును వేర్వేరుగా కలిసి పండుగ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండాడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు, 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, గ్రామ కమిటీ సభ్యులు చిన గోపి, చెట్టుపల్లి సన్యాసిరావు, సంగుబుజ్జి, కుమార్ పాల్గొన్నారు.

22వ వార్డులో చిల్లర దొంగతనాలు

మద్దిలపాలెం, జూలై 10 : జీవీఎంసీ 22వ వార్డులో చిల్లర దొంగల బెడద వెంటాడుతోంది. అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నారు. వార్డులోని బలరాంనగర్, రాజీవ్‌నగర్, పీతలవానిపాలెం, పిఠాపురం కాలనీ, మంగాపురం కాలనీ, తారామసీదు, శివాజీపాలెం ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. రాత్రి వేళ ఇక్కడ బైక్‌లు, ఆటోలు పార్కింగ్ చేయాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గంజాయికి బానిసైన కొంతమంది నగదు కోసం ఈ దొంగతనాలు చేస్తున్నారు. కళాభారతి పార్కులో వాచ్‌మేన్ లేకపోవడంతో చీకటి పడగానే ఇక్కడ గంజాయి సేవిస్తున్నారు. డాక్టర్ కాలనీ ఏరియాలో కూడా చీకటి పడితే యువకులు గంజాయి సేవిస్తున్నారు. వీరితో పాటు దొంగలు కూడా 22వ వార్డులో సెల్‌ఫోన్లు, బైక్‌లు, బంగారం చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో స్థానికులు మాజీ కార్పొరేటర్, టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో ఆయన బుధవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డులో అర్ధరాత్రి వేళ పోలీసుల నిఘా పెట్టి కోరారు. ఆయనతో పాటు వార్డు టీడీపీ వార్డు అధ్యక్షుడు దువ్వి స్వామి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

తగరపువలస, జూలై 10 : తగరపువలసలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ సీహెచ్‌కేవీ చౌదరి, విశాఖ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ ఆర్. రవిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న సరకులు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అలాగే గోదాములో నిల్వ ఉన్న సరకుల బిల్లు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను, లైసెన్సు కాపీలను సరిచూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల వద్ద వ్యవసాయ శాఖ ఇచ్చిన లైసెన్సు కాపీని ఫొటో కట్టించి, అందరికీ కనిపించేలా షాపులో ఉంచాలన్నారు. కొనుగోలుదారులకు రశీదులు అందించాలని, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మేటప్పుడు రశీదుపై డీలరు సంతకంతో పాటు కొనుగోలుదారుడి సంతకం కూడా ఉండాలని సూచించారు. దుకాణదారులు కంపెనీల నుంచి అనుమతి పత్రాలు తీసుకోకపోతే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కోమలి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జివలసలో 'నేను బడికి పోతా'

భీమునిపట్నం (రూరల్), జూలై 10 : మండలంలోని మజ్జివలస గ్రామంలో ఉపాధ్యాయులు బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, ఐదేళ్లు నిండిన వారిని పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎల్. కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం. శివరాణి, శ్రీనివాసరావు, లక్ష్మి, సర్పంచ్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలో జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులు నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 రమణ, ఎంఈఓ-2 బాబూలాల్. ఏఎల్ఎస్ శ్రీనివాసరావు, అసిస్టెంటు ఏఎంఓ లక్ష్మి, హెచ్‌ఎం ప్రశాంతి, సీఆర్‌పీలు బంగారునాయుడు, గౌరి, జట్లయ్య రమణ పాల్గొన్నారు.

ఆనందపురం : గిడిజాలలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ కలమటి శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, పాత్రుడు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో ప్రజా సేవకు ప్రాధాన్యం

వెంకోజీపాలెం, జూలై 10 :జాతీయ సేవా పథక కార్యక్రమాల్లో ప్రజా సేవకు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు అన్నారు. బుధవారం ఏయూలోని ఎన్ఎస్ఎస్ సెమినార్ హాల్లో జరిగిన జిల్లాస్థాయి ఎన్ఎస్ఎస్ అధికారుల వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్స్ పోలియో, శ్రమదానం వంటి దైనందిన కార్యక్రమాల స్థానంలో సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే నూతన విద్యా విధానంలో ప్రవేశపెట్టిన కమ్యూనిటీ ప్రాజెక్టుపై దృష్టిసారించాలని చెప్పారు.

ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం

సాగర్‌నగర్, జూలై 10 : రుషికొండ తీరంలో చిల్లర వర్తకులు, ఆటోస్టాండ్ అసోసియేషన్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా బుధవారం జాతీయ మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన నాయకులు శాఖరీ శ్రీనివాస్, బీజేపీ వార్డు అధ్యక్షుడు నాగరాజు, నాయకులు గద్దిపల్లి అప్పన్న, ఎరుపల్లి లక్ష్మణ, వాసుపల్లి ధనరాజు, గరికిన ఎల్లాజి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 10 : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపి వేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.